ప్రజాశక్తి
బుధవారం 31 మే 2023
5
కర్నూలు





నాడు పచ్చగా కళకళ

సిఎం వస్తున్నారని..

చెట్లను కొట్టేశారు..

ప్రజాశక్తి-పత్తికొండ

పత్తికొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి అంబేద్కర్ సర్కిల్ ప్రధాన రహదారి కి ఇరువైపులా నీడనిచ్చే చెట్లు ఉన్నాయి. పత్తికొండలో 1న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సెయింట్ జోసెఫ్ స్కూల్ మైదానంలో రైతు భరోసా కార్యక్రమానికి హాజరుకానున్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో హెలిపాడ్‌లో దిగి ప్రధాన రహదారి మార్గంలో బస్సు యాత్రతో సెయింట్ జోసెఫ్ స్కూల్ మైదానంలో ఏర్పాటుచేసి రైతు భరోసా కార్యక్రమం వరకు యాత్ర కొనసాగుతుంది. రోడ్డుకు ఇరువైపులా చెట్లు ఉండడంతో సీఎం జగన్మోహన్ రెడ్డి బస్సు యాత్రకు ఆటంకం కలుగుతుందని ప్రభుత్వ అధికారులు చెట్లను కూల్చి వేస్తున్నారు. నీడనిచ్చే చెట్లను కూల్చివేయడంతో స్థానిక ప్రజలు వాహనదారులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చెట్లు కూల్చివేసే అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



నేడు ఇలా విలవిల

దేవబెట్టలో గందాల స్వామిదాసు తల పగులగొట్టిన

కుల ఉన్మాదులను అరెస్టు చేయాలి

- కులం కారణంగా వివక్ష చూపుతూ దాడులకు తెగబడుతున్న ఉన్మాదుల పట్ల కఠినంగా వ్యవహరించాలి
- కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆనంద్ బాబు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

మండలంలోని దేవబెట్ట గ్రామంలో దళితుడైన గందాల రాజేష్, గందాల స్వామిదాసుపై కుల ఉన్మాదంతో దాడి చేసి స్వామిదాసు తల పగులగొట్టిన అహంకారులపై అట్రాసిటీ కేసు నమోదు చేసి, వెంటనే అరెస్ట్ చేయాలని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎమ్.డి.ఆనంద్ బాబు డిమాండ్ చేశారు. మంగళవారం దేవబెట్ట గ్రామంలో అహంకారుల చేతుల్లో దాడికి గురై ఎమ్మిగనూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న బాదితులను కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు ఎస్.దేవసహాయం, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆనంద్ బాబు, జిల్లా ఉపాధ్యక్షులు పిఎస్.రాధాకృష్ణ, బి.కరుణాకర్, బి.తిక్కప్ప, జిల్లా సహాయ కార్యదర్శి మామిడికాయల రాజు, ఎమ్మిగనూరు పట్టణ కార్యదర్శి సుమాల ఆంథోని, మండల కార్యదర్శి వర్గసభ్యులు రాజా రమేష్‌లు పరామర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. దేవబెట్ట గ్రామంలో గత 50 రోజుల క్రితం స్కూల్ పిల్లలు 'ఏలే..' అనే పదం (అంటే ఏరా.. అని అర్థం వచ్చే పదం) రెండు కులాలకు సంబంధించిన పిల్లలు వాడారని తెలిపారు. తమ పిల్లలు అంటే పడాలి తప్ప.. తిరిగి దళిత పిల్లలు ఎలా అంటారని ఆరోజే పెద్దలు ఘర్షణ పడ్డారన్నారు. పిల్లల మాటలకు ఘర్షణ ఎందుకని కలుగజేసుకుని సర్దిచెప్పిన గంధాల రాజేష్‌పై కక్ష పెంచుకున్న అహంకార వర్గాలు, సోమవారం రాత్రి 7.20 గంటలకు బహిర్భూమికి వెళ్తుండగా అడ్డుకుని దాడి చేశాయని తెలిపారు. అన్నపై దాడి చేస్తున్నారని తెలిసి అక్కడికి వెళ్లిన గంధాల స్వామిదాసు తల పగులగొట్టారని చెప్పారు. కరుడుగట్టిన కుల అహంకారాన్ని చిన్నపిల్లల నుంచే నూరిపోస్తు, దళితులపై విచక్షణ రహితంగా దాడి చేసిన గొల్ల వీరేష్, ఉరుకుందప్ప, చిన్న వీరేష్, నాగేంద్రప్ప, ఈరన్న, జగన్నాథ్, నాగేంద్ర, నాగరాజు, దేవేంద్ర, బలరాముడు, వీరేంద్ర, నర్సప్ప, బుడ్డ వెంకటేష్‌పై అట్రాసిటీ కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. దాడిలో గాయపడిన స్వామి దాసుకు మెరుగైన వైద్యం అందించాలని కోరారు. లేకపోతే జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కెవిపిఎస్ మండల అధ్యక్షులు చిన్నప్ప, ఛర్మకార వృత్తిదారుల సంఘం నాయకులు సుమాల రాజు ఉన్నారు.



బాధితుడు స్వామి దాసును పరామర్శిస్తున్న కెవిపిఎస్ నాయకులు



బదిలీల కౌన్సిలింగు నిర్వహిస్తున్న ఎస్‌పి కృష్ణకాంత్

పారదర్శకంగా బదిలీలు

- 68 మంది పోలీసుల బదిలీ : ఎస్‌పి కృష్ణకాంత్

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

పోలీసుల బదిలీల ప్రక్రియను పారదర్శకంగా పూర్తి చేశామని ఎస్పీ జి.కృష్ణకాంత్ తెలిపారు. ఖాళీలకు అనుగుణంగా పోలీసు స్టేషన్లను ఎంపిక చేసుకోవాలని సిబ్బందికి సూచించారు. జిల్లావ్యాప్తంగా పోలీసు స్టేషన్లు, ఆయా విభాగాల్లో ఒకే చోట ఐదేళ్లు పూర్తి చేస్తుకున్న కానిస్టేబుల్ నుంచి ఎఎస్ఐ స్థాయి వరకు ఉన్న పోలీసు సిబ్బందికి మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో బదిలీల కౌన్సెలింగ్ ప్రక్రియ చేపట్టారు. వివిధ పోలీసు స్టేషన్లు, ఆయా విభాగాల్లోని ఖాళీల వివరాలను సులువుగా ఎంపిక చేసుకునే విధంగా కౌన్సెలింగ్ నిర్వహించి బదిలీలు చేపట్టారు. ఒక్కొక్కరిని పిలిచి ఇది వరకు పని చేసిన సర్కిల్ పరిధిలోని పోలీసు స్టేషన్, సొంత మండలం కాకుండా మిగిలిన పోలీసు స్టేషన్లలో ఉన్న ఖాళీల ఆధారంగా కాన్ఫరెన్స్ హాలులో తెరపై చూపించి వారు కోరుకున్న చోటికి బదిలీ చేశారు. చీఫ్ ఆఫీస్ ఉత్తర్వుల మేరకే సాధారణ బదిలీల్లో భాగంగా పోలీసుల బదిలీల కౌన్సెలింగ్ ప్రక్రియ చేపట్టామని ఎస్పీ తెలిపారు. ఈ బదిలీల ప్రక్రియలో డిపిఒ ఎఒ సురేష్ బాబు, స్పెషల్ బ్రాంచి సిఐ ప్రసాద్ పాల్గొన్నారు.

ఎఐపిఇయు రాష్ట్ర కార్యవర్గంలో ఈశ్వరయ్య, మహమ్మద్ జానీ

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్





కర్నూలు నగరంలోని బిఎఎస్ కళ్యాణ మండపంలో ఆదివారం ప్రారంభమైన అఖిల భారత పోస్టల్ ఉద్యోగుల సంఘం (ఎఐపిఇయు) 3వ ద్వైవార్షిక రాష్ట్ర మహాసభ మంగళవారం ముగిసింది. మహాసభలో మంగళవారం రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర నూతన కార్యవర్గంలో కర్నూలుకు చెందిన కె.ఈశ్వరయ్యను రాష్ట్ర సహాయ కార్యదర్శిగా, ఎం.మహమ్మద్ జానీని రాష్ట్ర కౌన్సిల్ మెంబర్‌గా ఎన్నుకున్నారు.

మీపై ఎందుకు చర్యలు తీసుకోకూడదు

- ఉపాధిలో లక్ష్యాలు చేరుకోకపోవడంపై కలెక్టర్ ఆగ్రహం

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

ఉపాధి హామీ కూలీలకు పనులు కల్పించడంలో అలసత్వం వహించిన మీపై ఎందుకు చర్యలు తీసుకోకూడదని ఉపాధి హామీ సిబ్బందిపై కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆగ్రహం వ్యక్తం చేశారు. వారాంతపు లక్ష్యాలను ఎందుకు చేరుకోలేకపోతున్నారని మండిపడ్డారు. మంగళవారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో డ్వామా, పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులతో పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. వర్షాలు పడుతున్నాయని కారణాలు చెప్పకుండా మండలాలకు ఇచ్చిన లక్ష్యాలను పూర్తి చేయాలని ఆదేశించారు. ఒకవేళ వర్షాల వల్ల ఒక రోజు ఇబ్బంది కలిగితే రెండో రోజు, ముందు రోజు చేయాల్సిన పనిని కలుపుకొని పూర్తి చేయాలని తెలిపారు. ఉపాధి హామీ పనులకు సంబంధించి తక్కువ శాతం పని దినాలు జనరేట్ చేసిన నందవరం, ఎమ్మిగనూరు, గూడూరు ఏపీడీ పురోగతి సాధించాలని సూచించారు. సగటు వేతన రేట్‌కు సంబంధించి ఆస్పరి, నందవరం, వెల్దుర్తి, కర్నూలు పురోగతి సాధించాలని తెలిపారు. ఉపాధి హామీ కూలీలకు సరైన సమయంలో వేతనాలు అందిజేయాలని ఆదేశించారు. ఎస్ఎంఎంఎస్ యాప్‌లో తప్పనిసరిగా ఉపాధి హామీ కూలీల హాజరు నమోదు చేయాలన్నారు. సదరు యాప్‌లో వెల్దుర్తి, కర్నూలు, దేవనకొండ, హోళగుంద, చిప్పగిరి తక్కువ శాతంలో తక్కువ శాతం నమోదు చేస్తున్నాయని, అందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. 2021-22 సంవత్సరంలో పెండింగ్ ఉన్న 4,588 పనులకు సంబంధించిన పూర్తి వివరాలను ఎఇలు, ఎంపిడిఒలు సాయంత్రంలోపు అందజేయాలన్నారు. ఆధార్ అథెంటికేషన్ వెల్దుర్తి మండలంలో తక్కువ శాతం నమోదయిందని, అందుకు గాను పలుమార్లు వారితో తంబ్ వేయించి పూర్తి చేయాలని ఆదేశించారు. ఉపాధి హామీ కూలీలకు రద్దయిన చెల్లింపులకు సంబంధించి ఎక్కువ శాతం ఆదోనిలో పెండింగ్ ఉందన్నారు. ఉపాధి హామీ పనుల్లో ఎస్సీ, ఎస్టీలకు కూడా 47 శాతం కల్పించామని పీడీ తెలిపారు. అమృత్ సరోవర్ పథకంలో భాగంగా 75 ట్యాంకుల్లో 74 పూర్తి చేశామని, పెండింగ్‌లో ఉన్న ఒక్కటి కూడా పూర్తి చేస్తున్నామని వివరించారు. హార్టికల్చర్, మినీ గోకులం పనులను సంబంధించి పూర్తి చేయాలని తెలిపారు. చెత్త సంపద తయారీ కేంద్రాలకు సంబంధించి కర్నూలులో ఇంకా రెండు మొదలు కాలేదని కలెక్టర్ అడగగా స్థలానికి సంబంధించిన సమస్య ఉందని తెలిపారు. ఆ గ్రామానికి దగ్గరలోనే వాటికి అనుసంధానం చేసి సంబంధిత సమస్యను పరిష్కరించాలని డ్వామా పీడీ అమర్‌నాథ్ రెడ్డిని ఆదేశించారు. ప్రభుత్వ ప్రాధాన్యత భవన నిర్మాణాలకు సంబంధించి చెల్లింపులు చేసిన వాటికి దశలవారీగా పురోగతి చూపించాలని కలెక్టర్ తెలిపారు. సచివాలయ భవనాలకు సంబంధించి గ్రామాల్లో పెండింగ్ ఉన్న శాతాన్ని సర్పంచి నిధులతో పూర్తి చేసేలా అనుమతులు ఇవ్వాలని పంచాయతీ రాజ్ అధికారులు కోరారు. ఎన్ని పెండింగ్ ఉన్నాయో అందుకు తగిన నివేదిక తయారు చేయాలని కలెక్టర్ తెలిపారు. ఆర్‌డబ్ల్యుఎస్‌కు సంబంధించిన గుత్తేదారులతో త్వరగా పనులు పూర్తి చేయించడంతో పాటు ఒకసారి వారితో సమీక్ష ఏర్పాటు చేయాలని ఎస్ఇని ఆదేశించారు. గ్రామాల్లోని నీటి ట్యాంకులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. డ్వామా పీడీ అమర్‌నాథ్ రెడ్డి, పంచాయతీ రాజ్ ఎస్ఇ సుబ్రమణ్యం, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ నాగేశ్వరరావు, డిఇలు, ఏపీడీలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్



సమీక్షకు హాజరయిన అధికారులు

ఉద్యోగుల డిమాండ్లు నెరవేర్చాలి



నిరాహార దీక్షలు చేపడుతున్న జెఎసి నాయకులు

- అమరావతి జెఎసి ఆధ్వర్యంలో నిరాహార దీక్ష

ప్రజాశక్తి - కర్నూలు అగ్రికల్చర్

ఉద్యోగుల డిమాండ్లను నెరవేర్చాలని అమరావతి జెఎసి నాయకులు కోరారు. మంగళవారం ఎపి అమరావతి జెఎసి రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కర్నూలు నగరంలో ధర్నా చౌక్ వద్ద నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ దీక్ష జిల్లా జెఎసి చైర్మన్ గిరి కుమార్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గత 83 రోజులుగా ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం నిరసన చేపడుతున్నామని తెలిపారు. ఎక్కడా ప్రభుత్వానికి వ్యతిరేకంగా కానీ, అలాగే ప్రభుత్వం ఇబ్బంది పడే పరిస్థితిని కానీ కల్పించకుండా సామరస్య పూర్వక వాతావరణంలో నిరసన తెలియజేస్తున్నప్పటికీ ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. ఈ తీరు ఉద్యోగుల్లో తీవ్ర ఆందోళన నెలకొల్పిందని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఉద్యోగులు నాయకత్వాన్ని ఒత్తిడి చేసి ఉద్యమాన్ని ఉధృతం చేస్తే జరిగే పరిణామాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని హెచ్చరించారు. ఇప్పటివరకు ప్రభుత్వ ఉద్యోగులు చేస్తున్న నిరసనలన్నీ శాంతియుత వాతావరణంలో నిర్వహించామని తెలిపారు. భవిష్యత్తులో మిగిలి ఉన్నది 'సమ్మె' మాత్రమేనని, ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తే ప్రభుత్వ ఉద్యోగులు తీసుకునే నిర్ణయానికి, జరిగే పరిణామాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని చెప్పారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ప్రభుత్వానికి ఇచ్చిన వినతిపత్రంలో ఉన్న అంశాలను వెంటనే పరిష్కరించాలని కోరారు. ఉద్యోగుల సమస్యలు పరిష్కరించకపోతే ప్రజాసంఘాలన్నింటినీ కలుపుకుని ప్రభుత్వ ఉద్యోగులకు అండగా నిలిచి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఎపి అమరావతి జెఎసి జిల్లా నాయకులు రామానాయుడు, వెంకట్ రెడ్డి (మున్సిపల్ టీచర్స్ ఫెడరేషన్), డ్రైవర్స్ అసోసియేషన్ నాయకులు నాగేశ్వరరావు, వెటర్నరీ డాక్టర్స్ అసోసియేషన్ అనిష్, లక్ష్మణ్, ఎపి జెఎసి సంఘం సభ్యులు, ఎపి రెవెన్యూ సర్వీస్ అసోసియేషన్, ఎపిఎస్ఆర్‌టిసి, ఎపి పంచాయతీరాజ్, ఇంజినీర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.



ఎడిశామ్యూల్‌పాల్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా

మాంటిస్సోరి పాఠశాల పైన చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

విద్య హక్కు చట్ట ప్రకారం ప్రవేట్ విద్యాసంస్థల్లో భర్తీ చేయాల్సిన 25శాతం సీట్లలో ప్రభుత్వం కేటాయించిన విద్యార్థులకు సీట్లు ఇవ్వని మాంటిస్సోరి స్కూల్ పైన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా డిమాండ్ చేశారు. ఈ మేరకు స్కూల్ ఎడ్యుకేషన్ ఎడి శామ్యూల్ పాల్‌కు ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా, సిటీ అధ్యక్షులు అమర్ వినతిపత్రం అందజేశారు. అబ్దుల్లా మాట్లాడుతూ విద్యా హక్కు చట్టం ప్రకారం ప్రైవేట్ పాఠశాలలలో 25శాతం పేద బడుగు బలహీన వర్గ విద్యార్థులకు సీట్లు కేటాయించాలన్నారు. ప్రభుత్వం అందించే ఫీజులు సరిపోవు విద్యార్థుల తల్లిదండ్రులు ఆధారంగా ఫీజులు కడితేనే సీట్లు ఇస్తామని, లేదంటే ఇవ్వబోమని స్పష్టంగా చెబుతున్నారన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులను స్కూల్ చుట్టూ చాలాసార్లు తిప్పించుకుంటూ సీట్లు ఇవ్వడం లేదని, ఆధారాలతో సహా ఎడికి, డిఇఒకు అందజేశామన్నారు, అలాంటి పాఠశాలలపై ప్రభుత్వం విద్యాశాఖ అధికారులు జోక్యం చేసుకొని వెంటనే చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

కార్మికుల హక్కుల కోసం ఉద్యమం

ఘనంగా సిఐటియు 53వ ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కార్మికుల హక్కుల సాధన కోసం సిఐటియు ఆవిర్భవించిందని సిఐటియు రాష్ట్ర నాయకులు పి.నిర్మల అన్నారు. సిఐటియు 53వ ఆవిర్భావ దినోత్సవాన్ని సిఐటియు న్యూ సిటీ కమిటీ ఆధ్వర్యంలో కార్మిక, కర్షక భవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా నగర అధ్యక్షులు ఆర్.నరసింహులు అధ్యక్షతన సిఐటియు జెండాను పి.నిర్మల ఆవిష్కరించారు. ప్రజానాట్యమండలి కళాకారులు విప్లవ గీతాలు ఆలపించారు. అనంతరం సభనుద్దేశించి రాష్ట్ర నాయకురాలు పి.నిర్మల , సిఐటియు నగర కార్యదర్శి సి.హెచ్. సాయిబాబా, ఆశ వర్కర్స్ జిల్లా కార్యదర్శి రమీజాబి కార్మికులను మాట్లాడారు. సిఐటియు కార్మిక సంఘం 1970 మేన ఏర్పడిందని తెలిపారు. 53 యేళ్లలో కార్మికుల హక్కుల పరిరక్షణకు, కార్మికుల సంక్షేమం కోసం, కార్మికులకు కూలిరేట్ల పెంపుకోసం, యాజమాన్యాల కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతిఘటిస్తూ రాజీలేని పోరాటాలు సిఐటియు చేసిందన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మికుల హక్కులను హరిస్తోందన్నారు. సిఐటియు భవన నిర్మాణ కార్మిక సంఘం నగర అధ్యక్షులు కె.సుధాకరప్ప నగర నాయకులు జి.యేసు, మార్కెట్ యార్డ్ అధ్యక్షులు వెంకటేశ్వర్లు, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి రాజు, మద్దిలేటి, బతుకన్న పాల్గొన్నారు.



కర్నూలు సభలో మాట్లాడుతున్న పి.నిర్మల

కర్నూలు హాస్పిటల్ : భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలను అమలు చేయాలని సిఐటియు నాయకులు సుధాకరప్ప నరసింహులు డిమాండ్ చేశారు. సిఐటియు ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా వీకర్ సెక్షన్ కాలనీలో భవన నిర్మాణ కార్మిక సంఘం జెండాను సిఐటియు నగర అధ్యక్షులు ఆర్.నర్సింహులు ఎగురవేశారు. భవన నిర్మాణ కార్మిక సంఘం నగర అధ్యక్షులు కె సుధాకరప్ప, ఆర్ నరసింహులు మాట్లాడారు. సిఐటియు పోరాడి సాధించిన విజయాలను వివరించారు.

గూడూరు : సిఐటియు 53వ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా గూడూరు బస్టాండులో సిఐటియు జెండాను మండల సిఐటియు కార్యదర్శి జె. మోహన్ జెండాను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ సిఐటియు కార్మికుల ఐక్యత పోరాటాల కోసం పుట్టిందని కార్మిక రాజ్య స్థాపన లక్ష్యంగా పనిచేస్తుందన్నారు.

మద్దికేర: మద్దికేర మండల కేంద్రంలో సిఐటియు ఆవిర్భావ దినోత్సవం జండాను ఎగరవేశారు. సిఐటియు మండల కార్యదర్శి రాముడు మాట్లాడుతూ సిఐటియు ఆవిర్భావం, సాధించిన విజయాలను , పోరాటాలను వివరించారు. హమాలీలు తిమ్మప్ప, తిరుపాలు నరసింహ వెంకటేశ్వర్లు పారిశుధ్య కార్మికులు రామాంజి నమ్మ, నందిని, సుంకమ్మ, పంచాయతీ వర్కర్లు పాల్గొన్నారు.



గూడూరులో మాట్లాడుతున్న జె.మోహన్



కోడుమూరులో జెండా ఎగురవేస్తున్న సిఐటియు నాయకులు



విచారిస్తున్న వెల్దుర్తి ఎస్ఐ

హత్యకు దారి తీసిన దాయాదుల గొడవ

ప్రజాశక్తి-వెల్దుర్తి

వెల్దుర్తి మండలం సిద్ధినగట్టు గ్రామంలో మంగళవారం ఉదయం దాయాదుల గొడవ పెద్దదయి హత్యకు దారి తీసింది. గ్రామానికి చెందిన దాయాది అయిన బోడెన్నగారి రాముడు (50)ను అన్నదమ్ములు బాలకృష్ణ, మహేశ్ రాళ్లతో కొట్టి, కాళ్లతో తన్ని చంపారు. ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మృతుడు రాముడు వ్యవసాయం చేస్తూ, గొర్రెలు కాసుకుంటూ జీవనం సాగించేవాడు. తన తమ్ముడు లక్ష్మన్న కుటుంబానికి, అతని ఎదురుగా గల దాయాది కుటుంబానికి ఇంటి రస్తా, కళ్లందొడి రస్తా విషయంలో గొడవలున్నాయి. లక్ష్మన్న ఇంటి ఎదురుగా గల అన్నదమ్ములు బాలకృష్ణ, మహేశ్ సోమవారం సాయంత్రం గొడవపడ్డారు. గొడవపై గ్రామస్తులతోపాటు రాముడు సైతం సర్దిచెప్పారు. తిరిగి మంగళవారం లక్ష్మన్న భార్య లక్ష్మి బహిర్భూమికి వెళ్తుండగా అన్నదమ్ములైన బాలకృష్ణ, మహేశ్ అడ్డుకున్నారు. ఈ విషయం లక్ష్మి రాముడుకు తెలిపింది. రాముడు వచ్చి అన్నదమ్ములను ఎందుకు అడ్డుకుంటున్నారని ప్రశ్నిండంతో గొడవ పెద్దదయింది. అన్నదమ్ములు రాముడు ఎదపై రాళ్లతో కొట్టి, కాళ్లతో తన్నారు. గొడవ అనంతరం కొంత దూరం వెళ్లిన రాముడు తన ఇంటి ముందు చెట్టుకింద మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎస్ఐ గ్రామానికి చేరుకుని విచారించారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసును దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని డోనుకు పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.


నాలుగేళ్లలో రాష్ట్రం అభివృద్ధి : వైసిపి

జిల్లా వ్యాప్తంగా వైసిపి సంబరాలు

ప్రజాశక్తి-విలేకరులు

వైసిపి ప్రభుత్వం రాష్ట్ర ప్రజల సమగ్రాభివృద్ధి కోసం కృషి చేస్తుందని జిల్లా పరిషత్ ఛైర్మన్ ఎర్రపోతుల పాపిరెడ్డి తెలిపారు. జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఎన్నికయి నాలుగేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా జిల్లా పరిషత్‌లో ఘనంగా వేడుకలు చేశారు. జిల్లా పరిషత్ ఛైర్మన్ ఉద్యోగుల సమక్షంలో కేక్ కట్ చేసి అందరికి అందించారు. ఛైర్మన్ మాట్లాడుతూ వైసిపి పాలనలో రాష్ట్రం అభివది చెందిందన్నారు. ప్రతి పేదవాడి ఇంటికి సంక్షేమ పథకాలు వారి అవసరాలు ఇంటి ముంగిట్లోనే తీర్చేలా ప్రభుత్వ పాలన జరుగుతోందన్నారు. జిల్లాల విభజన, మెడికల్ కళాశాలల ఏర్పాటు, వాలంటీర్ వ్యవస్థ, గ్రామసచివాలయాలు వంటి అనేక అభివృద్ధి కారక్యక్రమాలను చేపట్టామన్నారు.

కల్లూరు అర్బన్ శరీన్ నగర్లో మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖరరెడ్డి విగ్రహం వద్ద పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, మేయర్ బివై.రామయ్య ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. వైయస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి, కేక్ కట్ చేసి ఒకరికొకరు తినిపించుకుని సంబరాలు చేసుకున్నారు. కర్నూలు ఎమ్మెల్యే హాఫిజ్ ఖాన్ ఆధ్వర్యంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు.కోడుమూరు నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ జె.సుధాకర్ ఆధ్వర్యంలో వైసిపి నాయకులు కార్యకర్తలతో కలిసి కేకును కట్ చేసి సంబరాలు నిర్వహించారు. వైసిపి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధికార్యక్రమాలను వివరించారు. అందుకే ప్రజల మనసులో ఉన్న వైసిపి భవిష్యత్తులో తిరిగి అధికారంలోకి వస్తుందని ఎమ్మెల్యేలు, మేయర్ తెలిపారు.



పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, మేయర్ బివై.రామయ్య ఆధ్వర్యంలో సంబరాలు

మేయర్ బివై.రామయ్య మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా నాలుగేళ్ల పాలన సాగిందన్నారు. ప్రతిరోజు ఏదో ఒక సంక్షేమ పథకం అమలుకు శ్రీకారం చుట్టారన్నారు. గ్లోబల్ సమ్మిట్‌తో రూ.13 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించిందన్నారు. ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి మాట్లాడుతూ నాలుగేళ్లలో ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన హామీల్లో 98.5 శాతం అమలు చేసిన ఘనత వైయస్ జగన్‌దే అన్నారు.



జిల్లా పరిషత్‌లో కేక్ కట్ చేస్తున్న ఛైర్మన్ ఎర్రపోతుల పాపిరెడ్డి



ఎమ్మెల్యే ఎంఏ.హాఫీజ్‌ఖాన్ ఆధ్వర్యంలో కేక్‌కట్ చేసి సంబరాలు జరుపుకుంటున్న కార్యకర్తలు

వైసిపి నాలుగేళ్ల పాలన సంబరాలు

ప్రజాశక్తి-ఆదోనిరూరల్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి

రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సంక్షేమ, అభివృద్ధి పాలన నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా వైసిపి శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. పట్టణంలోని మహబూబా ప్యాలెస్‌లో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అభివృద్ధి, సంక్షేమం అంటే ఏంటో చేతల్లో చేసి చూపిన నేతగా ముఖ్యమంత్రి జగన్ చరిత్రలో నిలిచారని కొనియాడారు. ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, మున్సిపల్ ఛైర్మన్ శాంత, వైసిపి యువనేత జయమనోజ్ రెడ్డి, వైసిపి పట్టణ గౌరవాధ్యక్షులు చంద్రకాంత్ రెడ్డి, వైసిపి జిల్లా కార్యదర్శి వెల్లాల మధుసూదన శర్మ, గురునాథ్ రెడ్డి, మండగిరి శేషిరెడ్డి, సన్నీ, గోపాల్ రెడ్డి, సర్పంచి రామకృష్ణారెడ్డి, సాదాపురం మురళీ, మెడికల్ నాగరాజు, బలరాం, హనుమంతప్ప, లింగన్న, కోటికి సంతోష్, మీసేవ నాగరాజ్, సర్పంచి నారాయణ, వరదప్ప, ఉలప్ప పాల్గొన్నారు.

ఇంటి స్థలాల లెక్క తేల్చండి

- తహశీల్దార్‌ను కోరిన సర్పంచి భీమయ్య

ప్రజాశక్తి - మంత్రాలయం


వినతిపత్రం అందజేస్తున్న భీమయ్య

మంత్రాలయం రాఘవేంద్ర నగర్ కాలనీలో ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించి ఖాళీగా ఉన్న ఇంటి స్థలాల లెక్క తేల్చి, స్థలాలు లేని పేదలకు కేటాయించాలని సర్పంచి భీమయ్య తహశీల్దార్ చంద్రశేఖర్‌ను కోరారు. మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గత టిడిపి హయాంలో ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి ఆధ్వర్యంలో 1998-99 సంవత్సరంలో ఇళ్లు లేని సుమారు 800 మంది నిరుపేదలకు ప్రభుత్వం ఇంటి స్థలాలు మంజూరు చేసిందని తెలిపారు. ఇప్పటి వరకు లబ్ధిదారులకు కేటాయించిన స్థలాల్లో ఎలాంటి నిర్మాణాలూ చేపట్టకపోవడం వల్ల కాలనీలో ఖాళీ స్థలాలు దర్శనమిస్తున్నాయని పేర్కొన్నారు. వర్షాకాలంలో ఖాళీగా ఉన్న ఇంటి స్థలాల్లో నీరు నిలిచి పందులకు నిలయంగా మారి దోమలకు, ఈగలకు ఆవాసంగా మారిందని తెలిపారు. పక్కన ఉన్న వారిని వ్యాధులకు గురి చేస్తున్నాయని చెప్పారు. ఇంటి స్థలాల్లేక ఇబ్బందులు పడుతున్న చాలా మంది పేదలు ఉన్నారని తెలిపారు. ఖాళీ స్థలాలను సర్వే ద్వారా గుర్తించి గతంలో ఇచ్చిన పట్టాలను రద్దు చేయాలని కోరారు. రాంపురం రెడ్డి సోదరుల ఆదేశాల మేరకు జగనన్న ఇళ్ల స్థలాల పంపిణీలో భాగంగా ఇంటి స్థలాల కోసం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకున్న వారికి తెలిపారు. ప్రస్తుతం గ్రామంలో ప్రభుత్వ భూములు లేక ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణాలకు, పేదలకు ఇళ్ల స్థలాల కేటాయింపునకు స్థలాలు లేక అవస్థలు పడుతున్నామని చెప్పారు. ఖాళీగా ఉన్న స్థలాలను సద్వినియోగం చేసుకునేందుకు అవకాశం కల్పించాలని కోరారు.

నిర్లక్ష్యం చేసిన వైద్యులపై చర్యలు తీసుకోవాలి

- ప్రతి వార్డు, వైద్యుల గదుల్లో సిసి కెమెరాలు అమర్చాలి

- జైభీమ్ యూత్ నాయకులు

ప్రజాశక్తి - ఆదోని

తేలుకాటుతో ఆస్పత్రిలో చేరిన భరత్ కుమార్‌కు మెరుగైన వైద్యం అందించకుండా నిర్లక్ష్యం చేసిన వైద్యులపై చర్యలు తీసుకోవాలని జై భీమ్ యూత్ ఆధ్వర్యంలో మంగళవారం ఆస్పత్రి ముందు నిరసన చేపట్టారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లింగన్న, కంటి వైద్య నిపుణులు పద్మ కుమార్‌తో బాలునికి అందించిన వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. నిర్లక్ష్యం చేసిన వైద్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం డాక్టర్‌కు మెమో ఇచ్చామని డాక్టర్ లింగన్న నచ్చ చెప్పారు. జై భీమ్ యూత్ నాయకులు కుమార్, తారక్ శంకర్ మాట్లాడారు. వైద్యులు, వైద్య సిబ్బంది పని తీరుపై పర్యవేక్షణ కోసం ఆస్పత్రిలోని ప్రతి వార్డు, ప్రతి డాక్టరు గదిలో సిసి కెమెరాలు ఏర్పాటు చేసి ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ పర్యవేక్షించాలని కోరారు. తేలుకాటుతో మృతి చెందిన బాలునికి అందించిన చికిత్సపై ఆరా తీశారు. ఆస్పత్రిలో ఎమర్జెన్సీ కాంటాక్ట్ నంబర్ ఉంచాలని, మృతుని కుటుంబానికి రూ.20 లక్షల నష్ట పరిహారం చెల్లించాలని, లేదా కుటుంబంలో ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని కోరారు. అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయంలో అధికారికి వినతిపత్రం అందజేశారు. శ్రీనివాస ఆచారి, సాయి, మోపిరి సూర్య, జార్జీ విల్సన్, నాగరాజ్ గౌడ్, తాహేర్‌వలీ, పులి రాజు, జన సైనికులు, నవీన్, బాలు, రవి, భాస్కర్ రెడ్డి ఉన్నారు.


ఆస్పత్రి ముందు నిరసన తెలుపుతున్న నాయకులు

కార్మికుల ఐక్యత లక్ష్యంగా, అండగా సిఐటియు జెండా

- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిబాబు

- ఘనంగా సిఐటియు ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

కార్మికుల ఐక్యత లక్ష్యంగా, కార్మికులకు అండగా, సమస్యల పరిష్కారానికి సిఐటియు జెండా నిలుస్తుందని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎమ్‌డి.అంజిబాబు తెలిపారు. మంగళవారం సిఐటియు ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యాలయం వద్ద సిఐటియు జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అంజిబాబు, సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్.రాధాకృష్ణ, ఉపాధ్యక్షులు బి.రామాంజనేయులు, పట్టణ కార్యదర్శి బి.రాముడు మాట్లాడారు. సిఐటియు కార్మికుల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తోందన్నారు. రైల్వే సమ్మె భారత దేశ రాజకీయాలను మార్చిందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణకు సిఐటియు నిరంతరం పని చేస్తుందని తెలిపారు. సిఐటియు నాయకులు కార్మికులతో కలిసి కేక్‌ను కట్ చేసి వేడుకలు నిర్వహించారు. నాయకులు వీరశేఖర్, ఆనంద్, రాజు, బి.రాజు, నరసింహులు, ఈరన్న గౌడ్, షబ్బీర్, మోహన్ దాస్, అబ్దుల్, వెంకటేశ్వర్లు శెట్టి పాల్గొన్నారు.

ఆదోని : కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ఉద్యోగ, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలపై ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్.రాధాకృష్ణ కోరారు. మంగళవారం సిఐటియు ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పట్టణంలోని సిఐటియు కార్యాలయం ముందు జెండాను ఆవిష్కరించారు. పట్టణ అధ్యక్షులు బి.తిప్పన్న అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడారు. ఉద్యోగ, కార్మికులకు ఎలాంటి సౌకర్యాలూ కల్పించకపోగా ఉన్న చట్టాల్లో మార్పులు చేసి కార్మికులకు తీవ్ర నష్టం కలిగిస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి ఆటో, హమాలీ తదితర కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సిఐటియు పట్టణ కార్యదర్శి పిఎస్.గోపాల్, నాయకులు బి.రాజు, బి.హనుమంతు, ఆటో, హమాలీ నాయకులు ఎల్లప్ప, లోకేష్, ఎం.రాజు, కెవిపిఎస్ మండల కార్యదర్శి తిక్కప్ప, హమాలీలు, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.


ఎమ్మిగనూరులో జెండాను ఆవిష్కరిస్తున్న అంజిబాబు



ఆదోనిలో సిఐటియు జెండాను ఆవిష్కరిస్తున్న రాధాకృష్ణ

పటిష్టమైన పార్టీ నిర్మాణంతోనే

ప్రజలకు అండగా నిలువగలం

- క్షేత్ర స్థాయి పరిశీలన, పరిష్కారం దిశగా పోరాటాలు చేపట్టాలి

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు ప్రభాకర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పటిష్టమైన పార్టీ నిర్మాణం ద్వారానే ప్రజలకు మరింత అండగా నిలువగలుగుతామని, క్షేత్రస్థాయి పరిశీలన, పరిష్కారం దిశగా పోరాటాలు నిర్వహించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు కె.ప్రభాకర్ రెడ్డి, సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయి తెలిపారు. మంగళవారం పట్టణంలోని పద్మశాలి కల్యాణ మండపంలో పశ్చిమ ప్రాంత జిల్లాస్థాయి సిపిఎం శిక్షణ తరగతులు రెండో రోజూ క్లాసును ప్రభాకర్ రెడ్డి ప్రారంభించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు కె.వెంకటేశులు ప్రిన్సిపల్‌గా వ్యవహరించారు. ఈ క్లాసుల్లో పార్టీ నిర్మాణానికి సంబంధించిన మొదటి క్లాసును కె.ప్రభాకర్ రెడ్డి బోధించారు. అనంతరం జిల్లా వర్క్‌షాపును నిర్వహించారు. జిల్లా వర్క్ షాపును ఉద్దేశించి సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయి మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాల వల్ల రోజువారీగా ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. అన్ని తరగతుల ప్రజానీకం సమస్యల పరిష్కారంలో సిపిఎంగా మరింత అండనివ్వాలన్నారు. అందుకు అవసరమైన పటిష్టమైన పార్టీ నిర్మాణాన్ని చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సమస్యలపై క్షేత్రస్థాయి పరిశీలనతో పాటు, పరిష్కారం కోసం క్షేత్రస్థాయి నుంచి పోరాటాలను నిర్వహించాలన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు బి.రామాంజనేయులు, పిఎస్.రాధాకృష్ణ, ఎమ్మిగనూరు పట్టణ కార్యదర్శి సి.హనుమంతు, జిల్లా కమిటీ సభ్యులు ఎమ్‌డి.ఆనంద్ బాబు, ఎమ్‌డి.అంజిబాబు, టి.నరసింహ, వీరశేఖర్, హనుమంతు, లక్ష్మన్న, లింగన్న పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయి


శేషారావు కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

శేషారావు కుటుంబానికి అండగా ఉంటాం : ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

ప్రజాశక్తి - కౌతాళం

వైసిపి మండల నాయకులు శేషారావు కుటుంబానికి అండగా ఉంటామని ఎమ్మెల్యే వై.బాలనాగి రెడ్డి తెలిపారు. శేషారావు, అతని కుమారుడు శివకుమార్ రోజుల వ్యవధిలోని మృతి చెందడంతో మంగళవారం వారి కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వైసిపి అభివృద్ధికి, తన గెలుపు కోసం తండ్రి కొడుకులు కృషి చేశారని తెలిపారు. వారి మృతి పార్టీకి తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకే కుటుంబంలో ఇద్దరు మృతి చెందడం తనకే ఇంత బాధ కలిగిస్తే వారి కుటుంబ సభ్యులు పడుతున్న ఆవేదన అర్థం చేసుకోగలమని తెలిపారు. ఈ కుటుంబానికి ఏ కష్టమొచ్చినా అండగా ఉంటామని చెప్పారు. ఎంపిపి అమ్రేష్, జడ్‌పిటిసి రాధా ప్రియదర్శిని, మండల కన్వీనర్ దేశాయి ప్రహ్లాద చారి, బసవ ప్రభు, వెంకటరామ్ రెడ్డి, వైస్ ఎంపిపి బుజ్జి స్వామి, అనిల్ ఉన్నారు.

జగనన్న బ్యాగులోని వస్తువుల ప్రదర్శన

ప్రజాశక్తి - చిప్పగిరి

చిప్పగిరి ఎంఆర్‌సి భవనంలో మంగళవారం ఎంఇఒ మస్తాన్ రావు ఆధ్వర్యంలో జగనన్న బ్యాగులోని వస్తువులను, విద్యార్థులకు ఇచ్చే యూనిఫారం, బూట్లు, నోట్ పుస్తకాలు తదితర వస్తువులను ప్రదర్శనగా పెట్టి నాణ్యత ఎలా ఉందో తెలుసుకోవడానికి పిల్లల తల్లిదండ్రులకు చూపించారు. జగనన్న అందిస్తున్న పాఠశాల వస్తువులన్నీ సంతృప్తికరంగా ఉన్నాయని పిల్లలు తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం ఎంఇఒ మాట్లాడుతూ... పాఠశాల ప్రారంభమయ్యే నాటికి ఇంకా పెండింగ్‌లో ఉన్న వస్తువులన్నీ అందుబాటులోకి వస్తాయన్నారు. ఎంఆర్‌సి కార్యాలయ సిబ్బంది శ్రీనివాసులు, నెట్టికల్లు పాల్గొన్నారు.

యువత రాజకీయాల్లో రాణించాలి

- మార్కెట్ యార్డు ఛైర్మన్ గుమ్మనూరు నారాయణ

ప్రజాశక్తి - చిప్పగిరి

చదువుకున్న యువతకు ఉద్యోగాలు రాలేదని దిగులు పడకుండా రాజకీయాల్లోనూ రాణించేలా ప్రయత్నం చేయాలని మార్కెట్ యార్డు ఛైర్మన్ గుమ్మనూరు నారాయణ సూచించారు. మార్కెట్ యార్డు ఛైర్మన్ పదవి పొందిన గుమ్మనూరు నారాయణను మంగళవారం గుమ్మనూరు గ్రామంలో పలు గ్రామాల నుంచి పెద్ద ఎత్తున యువత కలుసుకొని పూలమాల, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మనం ఏదైతే కోరుకున్నామో ఆ రంగం నుంచి ఎదగడానికి కృషి చేయాలన్నారు. అపజయాలు ఎదురైనా కసితో ముందుకెళితే సాధించలేనిది ఏమీ ఉండదన్నారు. తల్లిదండ్రులపై భారం పడకుండా స్వశక్తితో రాణించినప్పుడే సమాజంలో కూడా గుర్తింపు లభిస్తుందని తెలిపారు. సుధాకర్, సునీల్, అశోక్, భరత్, సులేమాన్, ప్రశాంత్ పాల్గొన్నారు.


ఛైర్మన్ నారాయణను ఘనంగా సన్మానిస్తున్న యువకులు

జగన్మోహన్ రెడ్డితో రాష్ట్రం సస్యశ్యామలం

- అనంతపురం జిల్లా కెడిసిసి బ్యాంకు ఛైర్మన్ పామిడి హీరా

ప్రజాశక్తి - చిప్పగిరి

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డితోనే రాష్ట్రం సస్యశ్యామలం అవుతుందని అనంతపురం కెడిసిసి బ్యాంకు ఛైర్మన్ పామిడి హీరా తెలిపారు. మంగళవారం చిప్పగిరి మండలం దౌల్తాపురం గ్రామంలో వైసిపి నాయకులు ఆటో సుంకన్న దేవర మహోత్సవానికి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా దౌల్తాపురం గ్రామానికి చెందిన వైసిపి యువ నాయకులు రామలక్ష్మణ స్వామి, మాజీ ధర్మకర్త దామోదర్ పామిడి హీరాను శాలవా, పూలమాలతో సన్మానించారు. అనంతరం పామిడి హీరా మాట్లాడుతూ... మాజీ ధర్మకర్త దామోదర్‌కు, తనకు 20 ఏళ్ల స్నేహ సంబంధాలను గుర్తు చేశారు. జిల్లాలు వేరైనా, రాజకీయ పార్టీ ఒక్కటేనని పేర్కొన్నారు. 2024లో ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డి పదవి చేపడతారని జోష్యం చెప్పారు. దౌల్తాపురం గ్రామస్తులకు, తనకు స్నేహ సంబంధాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. అనంతరం దేవర లో పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆటో సుంకన్న కుటుంబ సభ్యులు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.


పామిడి హీరాను సన్మానిస్తున్న దామోదర్

వైసిపి నాయకుల ఆటవికం

- జనసేన ఇన్‌ఛార్జీ మల్లప్ప

ప్రజాశక్తి - ఆదోని

పేదలకు, పెత్తందారులకు మధ్య జరిగే యుద్ధం అనే పేరుతో వైసిపి నాయకులు అత్యంత ఆటవికంగా జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ పల్లకి మోస్తున్నట్లు ఫ్లెక్సీ వేయడం వల్ల జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల మనోభావాలు దెబ్బతింటున్నాయని జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జీ మల్లప్ప ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం ప్రతి చర్యగా చట్టాన్ని చేతిలోకి తీసుకోకుండగా, ఎక్కడా కూడా యాంటీ బ్యానర్స్ వేయకుండా నిలువరించి, ముందుగా ఆదోని మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ అందుబాటులో లేకపోవడంతో మేనేజర్‌కు, ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో అసిస్టెంట్ సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేశారు. జనసేన నాయకులు రేణు వర్మ, గాజుల రాజశేఖర్, నెల్లిబండ్ల రాజశేఖర్, చంద్ర శేఖర్, తాహెర్ వలీ, చిరుత రాజశేఖర్, ప్రకాష్, రాయ నగర్ శ్యామ్, పులి రాజు, అయ్యప్పన్, జన సైనికులు జయరాం, వెంకటేష్, వీరేష్, మహేంద్ర, గోవిందు, శీన, విశాల్ పాల్గొన్నారు.

డిటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులుగా గంగాధర్, మనోరంజని

ప్రజాశక్తి - గోనెగండ్ల




డిటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులుగా గోనెగండ్ల మండలానికి చెందిన వి.గంగాధర్, మనోరంజని ఎంపికైనట్లు డిటిఎఫ్ మండల అధ్యక్షులు శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి మనోహర్ తెలిపారు. మంగళవారం వారు మాట్లాడారు. జిల్లా ఉపాధ్యక్షులుగా ఎన్నికైన వీరు 24 ఏళ్లుగా డిటిఎఫ్ నిర్మాణానికి విశేష కృషి చేస్తూ ఉపాధ్యాయ వృత్తిని, నిబద్ధత సామాజిక సేవా దృక్పథంతో నిర్వహిస్తున్నారని తెలిపారు. వీరు ఫ్యాప్టో, ఎపి జెఎసి, ఎపి ఎస్‌ఈబి, రాయలసీమ ప్రజా ఉద్యమాల్లో చురుకుగా పాల్గొన్నారని చెప్పారు. మండలం నుంచి వీరిని జిల్లా ఉపాధ్యక్షులుగా ఎంపిక చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

11న బీసీ గర్జనను జయప్రదం చేయండి : బీఎస్పీ

ప్రజాశక్తి - కోసిగి రూరల్

బహుజన్ సమాజ్‌వాది పార్టీ కర్నూలు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జూన్ 11న ఎమ్మిగనూరు పట్టణంలో జరిగే బీసీ గర్జనను జయప్రదం చేయాలని బహుజన్ సమాజ్ వాది పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జీ పల్లెపాడు లక్ష్మన్న, కార్యదర్శి పల్లెపాడు యాకోబ్ కోరారు. మంగళవారం కోసిగి మండలంలోని పల్లెపాడు గ్రామంలో బహుజన సమాజ్‌వాది పార్టీ బీసీ గర్జనకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కోసిగి మండలం నుంచి బహుజన్ సమాజ్‌వాది పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు, ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి బీసీ గర్జన సభను విజయవంతం చేయాలని కోరారు. బహుజన్ సమాజ్ వాది పార్టీ రాష్ట్ర అధ్యక్షులు బక్క పరంజ్యోతి, రాష్ట్ర కోఆర్డినేటర్ ఆర్జే మలికల్, రాష్ట్ర నాయకులు ముఖ్య అతిథులుగా పాల్గొంటున్నట్లు తెలిపారు. మండలంలోని చింతకుంట, కోసిగి, సాతనూరు కొట్టాల, జంపాపురం, వందగల్లు తదితర గ్రామాల్లో ప్రచారం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పల్లెపాడు చిన్న లక్ష్మన్న, బుజ్జి పాల్గొన్నారు.


లెక్కింపును పర్యవేక్షిస్తున్న మేనేజర్ శ్రీనివాసరావు

రికార్డు స్థాయిలో శ్రీమఠం హుండీ ఆదాయం

- 34 రోజుల ఆదాయం రూ.3,53, 79,852

- శ్రీమఠం మేనేజర్ శ్రీనివాసరావు

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన శ్రీరాఘవేంద్రస్వామి మఠం నెల రోజుల హుండీ ఆదాయం లెక్కించగా రూ.3,53,79,852 వచ్చిందని, మునుపెన్నడూ లేనివిధంగా రికార్డు స్థాయిలో వచ్చినట్లు శ్రీమఠం మేనేజర్ ఎస్‌కె.శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం స్థానిక శ్రీమఠం నిర్వహణలో ఉన్న సభా మండపంలో 34 రోజుల హుండీ ఆదాయాన్ని దేవదాయ శాఖ అధికారులు, శ్రీమఠం అధికారులు, సేవాదారుల సమక్షంలో లెక్కించారు. రాఘవేంద్రస్వామి దర్శనార్థమై దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు కానుకల రూపంలో హుండీలో వేసిన ఆదాయాన్ని లెక్కించారు. నగదు రూపంలో రూ.3,53,79,852, వెండి కిలో 187 గ్రాములు, బంగారు 192 గ్రాములు వచ్చిందని తెలిపారు.

1న ఉద్యోగుల సమస్యలపై దీక్షలు

- ఎపి జిఈఎ తాలూకా అధ్యక్షులు రషీద్

ప్రజాశక్తి - ఆదోని



ఉద్యోగ సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం మొండి వైఖరిని నిరసిస్తూ జూన్ 1న స్థానిక ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద దీక్షలు చేపట్టనున్నట్లు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఎపి జిఈఎ) తాలూకా అధ్యక్షులు ఎస్ఎ.రషీద్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చి నాలుగేళ్ల పూర్తయినా ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చిన హామీలను మాత్రం నెరవేర్చలేదన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఉద్యమ కార్యాచరణలో భాగంగా దీక్షలను చేపట్టామన్నారు. సిపిఎస్‌ను రద్దు చేయాలని, ప్రతినెలా 1న జీతభత్యాలు చెల్లించేలా చట్టం తీసుకు రావాలని కోరారు. పిఆర్‌సి బకాయిలను తక్షణమే చెల్లించాలన్నారు. ఉద్యోగులంతా దీక్షలో భారీ ఎత్తున పాల్గొని విజయ వంతం చేయాలని కోరారు.

సంక్షేమానికి చిరునామా జగన్ ప్రభుత్వం

- ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

ప్రజాశక్తి - కౌతాళం

రాష్ట్రంలో అమలు చేస్తున్న పథకాలే ప్రజా సంక్షేమానికి చిరునామా అని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని నదీచాగి గ్రామంలో 'గడపగడపకు మన ప్రభుత్వం' నిర్వహించారు. ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి, వైసిపి రాష్ట్ర యువ నాయకులు వై.ప్రదీప్ రెడ్డిలు గడపగడపకు తిరుగుతూ లబ్ధిదారులకు అందిన ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరిస్తూ వారి సమస్యల గురించి ఆరా తీశారు. తమ కాలనీకి విద్యుత్ స్తంభాలు, తాగునీరు, డ్రెయినేజీ, కం రోడ్లు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరారు. ఎమ్మెల్యే స్పందిస్తూ... త్వరలో తాగునీరు, విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేస్తామని, రోడ్డు నిర్మాణానికి కొంత సమయం పడుతుందని చెప్పారు. అనంతరం వాలంటీర్లకు వందనం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే బాలనాగి రెడ్డి మాట్లాడారు. సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, గ్రామ నాయకులు, సర్పంచి, ఎంపిటిసిలు, గృహ సారథులు గ్రామ కన్వీనర్లను సమన్వయం చేసుకుంటూ ప్రతి లబ్ధిదారునికీ మేలు జరిగేలా చూడాలని సూచించారు. వాలంటీర్లు ఎట్టి పరిస్థితుల్లోనూ లంచాలకు తావు లేకుండా నాయకుల సూచనల మేరకు లబ్ధిదారులకు మేలు జరిగేలా విధులు నిర్వహించాలని తెలిపారు. సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు నిర్లక్ష్యం చేయకుండా జాగ్రత్తగా పని చేయాలని సూచించారు. మండలంలోని వాలంటీర్లకు ప్రకటించిన వజ్ర అవార్డుల్లో ఏకైక అవార్డు నదీచాగి వాలంటీరుకు రావడం సంతోషంగా ఉందని నదీచాగి రామన్న గౌడ్ తెలిపారు. గ్రామంలో ఉన్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా సచివాలయానికి ఇచ్చే రూ.20 లక్షల నిధులను ప్రస్తుతం ఉన్న సమస్యలు పరిష్కరించేందుకు ఉపయోగించాలని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం నాలుగేళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా వేదికపై భారీ కేక్‌ను ఎమ్మెల్యే కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. వైసిపి మండల కన్వీనర్ దేశాయి ప్రహ్లాద చారి, ఉరుకుంద ట్రస్ట్ బోర్డ్ ఛైర్మన్ నాగరాజు గౌడ్, జడ్‌పిటిసి రాధా ప్రియదర్శిని, ఎంపిపి అమరేష్, కో ఆప్షన్ సభ్యులు మాబు సాబ్, వైస్ ఎంపిపి బుజ్జి స్వామి, రామన్నగౌడ్, ఏకం రెడ్డి, సర్పంచి మహేష్, ఎంపిటిసి లింగన్న గౌడ్, మాజీ ఎంపిటిసి ఈశప్పగౌడ్, బొగ్గురు గౌడ్, బసవ ప్రభు, మరి గౌడ్, కౌతాళం సర్పంచి పాల్ దినకరన్, ఎంపిడిఒ శేఖర్, తహశీల్దార్ రమేష్ రెడ్డి, హౌసింగ్ డిఇ కృష్ణలాల్, పిఆర్ ఎఇ శ్రీనివాస్, ఎఒ శేషాద్రి పాల్గొన్నారు.


పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

టిడిపి మేనిఫెస్టోలో మహిళలకు పెద్దపీట

- టిడిపి నాయకులు

ప్రజాశక్తి- దేవనకొండ

టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు మహానాడులో ప్రవేశపెట్టిన మేనిఫెస్టోలో మహిళలకు పెద్దపీట వేశారని టిడిపి మండల కన్వీనర్ విజయ భాస్కర్ గౌడ్, టిడిపి నాయకులు బడిగింజల రంగన్న, ఉచ్చీరప్ప, రామారావు నాయుడు తెలిపారు. మంగళవారం టిడిపి కార్యాలయ ఆవరణలో టిడిపి నాయకులు, మహిళలు చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మహిళలకు ప్రవేశపెట్టిన ఆడబిడ్డ నిధి కింద ప్రతి కుటుంబంలో 18 ఏళ్ల నుంచి 59 ఏళ్ల మహిళలకు నెలకు రూ.1500, తల్లికి వందనం కింద కుటుంబంలో చదివే పిల్లలకు ఒక్కొక్కరికి రూ.15 వేలు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ప్రతి గృహణికీ మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇవ్వడం వంటి పథకాలు ప్రవేశట్టడం హర్షించదగ్గ విషయమని తెలిపారు. రైతులకు ఒక్కొక్కరికి రూ.20 వేలు, నిరుద్యోగులకు నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి, యువతకు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. టిడిపి నాయకులు మల్లయ్య, మాలిక్ బాష, ఆకుల వీరేష్, వెంకటస్వామి గౌడ్, మల్లికార్జున గౌడ్, రాజశేఖర్ గౌడ్, బండ్లయ్య, రాజాసాబ్, పెద్దయ్య, మస్తాన్ పాల్గొన్నారు.


చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న టిడిపి నాయకులు

చిన్నహ్యాటకు తాగునీటి సౌకర్యం

ప్రజాశక్తి - హొళగుంద


తాగునీటి సౌకర్యం కల్పిస్తున్న సర్పంచి

మండలంలోని చిన్నహ్యాటలో తాగునీటి సౌకర్యం కల్పించారు. మంగళవారం సర్పంచి డిఎస్.హుస్సేనుల్లా, ఉప సర్పంచి, వార్డు మెంబర్ల సహకారంతో జాలి చెరువులో జలజీవన్ మిషన్ పథకం ద్వారా వేసిన తాగునీటి బోరుకు పంచాయతీ నిధులతో పరికరాలు బిగించారు. ప్రజలకు తాగునీటి సౌకర్యం కల్పించారు. అలాగే న్యూ బీసీ కాలనీ ప్రజలు తాగునీటి కోసం పడే కష్టాలను దృష్టిలో ఉంచుకొని స్థానిక రామలింగేశ్వర స్వామి ఆలయం నుంచి న్యూ బీసీ కాలనీ వరకు తాగునీటి కొత్త పైపులైన్ పనులు చేపట్టారు. ఎన్నో ఏళ్ల నుంచి తాగునీటి కోసం ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యను తీర్చినందుకు సర్పంచి, ఉప సర్పంచి, వార్డు మెంబర్లు, ఆలూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జీ డిఎస్.బాషకు ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఉప సర్పంచి భర్త రమేష్, డిఎస్.బాష, కాంగ్రెస్ నాయకులు డిఎస్.నూర్, గిడ్డయ్య, ఇబ్రహీం పాల్గొన్నారు.

ప్రజలకు, ప్రభుత్వానికి వారధులు వాలంటీర్లు : వైసిపి

ప్రజాశక్తి - హొళగుంద

వాలంటీర్లు ప్రజలకు, ప్రభుత్వానికి వారధులని వైసిపి యువనేత ఎస్‌కె.గిరి తెలిపారు. మంగళవారం ఎల్లార్తి సర్పంచి కురువ ఛాముండేశ్వరి ఆధ్వర్యంలో సచివాలయంలో వాలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గిరి మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సచివాలయం, వాలంటీరు వ్యవస్థను ఏర్పాటు చేసి దేశంలోనే ఆదర్శంగా నిలిచారని తెలిపారు. సచివాలయ సిబ్బంది కుషా నాయక్, శివ రాజు నాయక్, రాజేశ్వరి, ధన లక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పి నీరజ్ పాల్గొన్నారు.

టిడిపి కార్యకర్త మృతికి నివాళి

ప్రజాశక్తి - పెద్దకడబూరు

మండలంలోని హెచ్.మురవాణి గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్త కురువ బుడ్డన్న మృతి చెందారు. విషయం తెలుసుకున్న టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ తిక్కారెడ్డి సోదరుడు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాస్ రెడ్డి మంగళవారం బుడ్డన్న మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. టిడిపి నాయకులు సత్తన్న, చంటి, నరసయ్య, జనార్దన్, రంగన్న, లాజర్, తెలుగు యువత చెన్నకేశవ, టిడిపి ఉపాధ్యక్షులు నీలకంఠ పాల్గొన్నారు.


నివాళు లర్పిస్తున్న నాయకులు

'వేదవతి'ని కాలయాపన చేయడం తగదు

- సిపిఎం సీనియర్ నాయకులు నారాయణస్వామి

ప్రజాశక్తి-ఆలూరు


మాట్లాడుతున్న నారాయణస్వామి

వేదవతి ప్రాజెక్టు నిర్మాణాన్ని కాలయాపన చేయడం తగదని సిపిఎం సీనియర్ నాయకులు కెపి.నారాయణ స్వామి, మండల కార్యదర్శి షాకీర్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక జ్యోతి బసు భవనంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఆలూరు ప్రాంతం సస్యశ్యామలం కావాలంటే వేదవతి, నగరడోన ప్రాజెక్టులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని తెలిపారు. ఆలూరులో స్పిన్నింగ్ మిల్లులను, ఆస్పరి టమోటా జ్యూస్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సిపిఎం నాయకులు కృష్ణ, గోవర్ధన్ పాల్గొన్నారు.

ఈరన్న స్వామి హుండీ ఆదాయం రూ.1,12,83,485


ప్రజాశక్తి - కౌతాళం

శ్రీనరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి హుండీ ఆదాయం రూ.1,12,83,485 వచ్చిందని దేవాలయ సహాయ కమిషనర్ వాణి తెలిపారు. మంగళవారం స్వామి వారి హుండీని దేవాలయం కమిటీ ఛైర్మన్ నాగరాజు గౌడ్, జిల్లా దేవదాయ శాఖ జూనియర్ అసిస్టెంట్ సుబ్బరాయుడు ఆధ్వర్యంలో లెక్కించారు. స్వామి వారికి నగదుతో పాటు బంగారం 56 గ్రాములు, వెండి 16 కిలోల 400 గ్రాములు భక్తులు సమర్పించినట్లు తెలిపారు. దేవాలయ ప్రధాన అర్చకులు ఎక్స్ అఫీషియో సభ్యులు ఈరప్ప స్వామి, పాలక మండలి సభ్యులు వెంకోబా, నరసింహులు, నరేంద్ర కుమార్ రెడ్డి, లక్ష్మీ రెడ్డి, రెడ్డి గీత, నరసమ్మ పాల్గొన్నారు.

అలారుదిన్నెలో డెంగీ కేసు నమోదు

ప్రజాశక్తి - దేవనకొండ

మండలంలోని అలారుదిన్నె గ్రామంలో డెంగీ కేసు నమోదయినట్లు మలేరియా సబ్ యూనిట్ అధికారి సాయి బాబా తెలిపారు. గ్రామంలోని ఓ బాలికకు డెంగీ వ్యాధి లక్షణాలు ఉండడంతో కర్నూలు ప్రభుత్వాస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించినట్లు చెప్పారు. మంగళవారం ఆరోగ్య సిబ్బందితో గ్రామంలోని అపరిశుభ్రత ప్రాంతాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లించినట్లు తెలిపారు. డెంగీ కేసు నమోదయిన వారి ఇంటి పరిసరాలు శుభ్రం చేయించి చుట్టుపక్కల ప్రాంతాల్లో స్ప్రేయింగ్ చేసినట్లు తెలిపారు. హెల్త్ సూపర్‌వైజర్ రామ్మోహన్, ఆరోగ్య కార్యకర్త, ఆశాలు పాల్గొన్నారు.





నంద్యాలలో సిఐటియు జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

రాయితీ 'పట్ట'లకు మంగళం

- వైసిపి ప్రభుత్వంలో నాలుగేళ్లుగా జాడే లేని వైనం
- గత టిడిపి హయాంలో 50 శాతంపై పంపిణీ



వర్షం రావడంతో రైతులు ధాన్యం తడవకుండా కప్పిన పట్టలు (ఫైల్)

ప్రజాశక్తి - చాగలమర్రి

చాగలమర్రి మండలంలో ఇటీవల అకాల వర్షాలు కురుస్తున్నాయి. ఆరబెట్టిన ధాన్యాలు, మొక్కజొన్న పంటలు తడిసిపోకుండా కాపాడు కోవడానికి అన్నదాతలు నానా అగచాట్లు పడుతున్నారు. తమ వద్ద ఉన్న పాత చిరిగిపోయిన టార్పాలియన్ పట్టలు కప్పి రక్షణ కల్పించేందుకు ఎంత ప్రయత్నించినా ఉపయోగం లేకుండా పోయింది. ధాన్యం తడిసిపోయి తీవ్రంగా నష్టపోయారు. మరికొందరు రైతులు అద్దెకు పట్టలు దొరుకుతాయేమోనని పరుగులు పెట్టినా ఫలితం శూన్యం. టార్పాలియన్ పట్టలు లేక చాలా నష్టపోయామని, ధాన్యం, మొక్కజొన్న పంట తడిసి రంగు మారిపోయిందని రైతులు విలవిల్లాడారు.

చాగలమర్రి మండలంలో అధికంగా వరి, పత్తి, మొక్కజొన్న, జొన్న, కంది పంటలు పండిస్తారు. ఖరీఫ్ సీజన్ చివరి రోజుల్లో వర్షాలు బాగా కురుస్తున్నాయి. కళ్ళాల్లో ధాన్యంతో పాటు ఇతర పంటలు తడిసిపోతున్నాయి. రాత్రివేళ టార్పాలియన్లు కప్పి పగటివేల తొలగిస్తుంటారు. దీనివల్ల మంచు, వర్షం నుంచి కాపాడుకుంటారు. నూర్పిడి తరువాత ధాన్యం ఆరబెట్టుకునే సమయంలో వర్షాలు వస్తే నష్టపోకుండా టార్పాలియన్లు కాపాడతాయి. మొక్కజొన్న పండించే రైతులు కూడా వర్షాలు వచ్చినప్పుడు పట్టల మీద ఆధారపడతారు. ఇంత అవసరం ఉన్న పట్టలను ప్రభుత్వం రాయతీ మీద నాలుగేళ్లుగా ఇవ్వడం లేదు. వరుస వర్షాల నేపథ్యంలో పట్టలను రైతులు కొనుగోలు చేసుకోక తప్పలేదు. నాణ్యత పరిమాణాన్ని బట్టి రూ. 4 నుంచి 10 వేల వరకు అధికంగా ఖర్చు పెట్టక తప్పలేదు.

రాయితీకి వైసిపి ప్రభుత్వం మంగళం

అకాల వర్షాలు కురిసిన సమయాల్లో పంట ఉత్పత్తులు తడవకుండా కాపాడుకోవడానికి రైతులకు పట్టలు(టార్పాలియన్లు) అత్యంత అవసరం. పంట దిగుబడులు చేతికి వచ్చే దశలో వర్షాలు పడితే ఈ పట్టలకు విపరీతమైన డిమాండ్ ఉంటుంది. దీనిని గుర్తించిన గత ప్రభుత్వం 50 శాతం రాయితీపై రైతులకు పంపిణీ చేసేది. వైసిపి అధికారంలోకి వచ్చాక రాయితీపట్టలకు మంగళం పాడింది. దీంతో రైతులు బహిరంగ మార్కెట్లో అధిక ధరలు చెల్లించి కొనుగోలు చేసుకోవాల్సి వస్తోంది. ప్రభుత్వం రాయితీ మీద పంపిణీ చేయకపోవడంతో తయారీదారులు ధరలు పెంచి విక్రయిస్తున్నారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో కర్షకులు అధిక ధరలు వెచ్చించి కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. చాగలమర్రి మండలంలో ఇటీవల వర్షాలకు ధాన్యాన్ని కోసి ఆరబెట్టిన పంటలను రక్షించు కోవడానికి ఒక్కొక్కరు సుమారు పది వేల రూపాయలకు పైగా వీటి కోసం వెచ్చించామని రైతులు చెబుతున్నారు.

అదనపు భారం

ఖరీఫ్ రబీ సీజన్లో పంట ఉత్పత్తులను ఆరుబయట ఉంచినప్పుడు వర్షం, మంచు నుంచి కాపాడుకోవడానికి ప్రతి రైతుకూ పట్టలు అవసరం. తుఫాన్లు, వాయుగుండాలు ఏర్పడినప్పుడు పంట చేజారిపోకుండా టార్పాలిన్ల ద్వారా కాపాడుకుంటారు. అనుకోకుండా వచ్చే వర్షాల సమయంలో పంట ఉత్పత్తులు ఆరబెట్టే ప్రాంతంలోనే పట్టలు సిద్ధంగా ఉంచుకుంటారు. అంత కీలకమైన పట్టలను ప్రభుత్వం రాయతీపై అందించి ఆదుకోవాల్సి ఉంది. కానీ అందుకు విరుద్ధంగా ప్రస్తుత ప్రభుత్వం నాలుగేళ్లుగా రైతులకు పట్టలను పంపిణీ చేయకుండా వారిపై అదనపు భారం పడేలా చేస్తోంది. ఇక ముందైనా ప్రభుత్వం టార్పాలియన్ల రాయితీ పథకాన్ని ప్రభుత్వం పునరుద్ధంచాలని రైతులు కోరుతున్నారు. దీనిపై మండల వ్యవసాయ అధికారి రంగ నేతాజీని వివరణ కోరగా రాయితీ టార్పాలిన్ల పథకం నాలుగేళ్లుగా ఆగిపోయిందన్నారు. ప్రభుత్వం పునరుద్ధరిస్తే తప్ప రైతులకు అందించలేమని చెబుతున్నారు. మరి రైతు ప్రభుత్వమని చెప్పుకుంటున్న వైసిపి ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపడుతుందా లేదో చూడాల్సిందే..



పొలాల్లో ధాన్యం తడవకుండా కప్పిన పట్టలు

ఐక్య పోరాటాలతోనే హక్కులు

- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు
- జిల్లా వ్యాప్తంగా సిఐటియు ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి - నంద్యాల

ఐక్య పోరాటాల ద్వారానే హక్కులు సాధ్యమవుతాయని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు అన్నారు. సిఐటియు 53వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నంద్యాల జిల్లా వ్యాప్తంగా జెండావిష్కరణలు జరిగాయి. నంద్యాల పట్టణంలోని గాంధీ చౌక్ సెంటర్లో లారీ హమాలీ, ఆర్టీసీ హమాలీ, టెక్కె మార్కెట్ యార్డ్ హమాలీ, నూనెపల్లి హమాలీ, నూనెపల్లి ఆటో వర్కర్స్, రైల్వేగూడ్ షెడ్ ముఠా వర్కర్ తదితర యూనియన్ల ఆధ్వర్యంలో సిఐటియు ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు, జిల్లా ఉపాధ్యక్షులు తోట మద్దులు, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మణ్, కే మహమ్మద్ గౌస్, పట్టణ కోశాధికారి వెంకట లింగంలు జెండావిష్కరణ ఆరు చోట్ల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1970 మే 30న కోల్‌త్తాలో సిఐటియు ఏర్పడిందన్నారు. నాటి నుంచి ఉద్యోగ, కార్మిక సమస్యలపై రాజీలేని పోరాటం సిఐటియు చేస్తుందన్నారు. అసంఘటిత రంగ కార్మికులకు సమగ్ర వేతన చట్టం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఆటో, లారీ, ట్రాన్స్‌పోర్ట్ కార్మికుల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి రవాణా రంగ కార్మిక కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి పిఎఫ్, ఈఎస్ఐ, రిటైర్మెంట్ బెనిఫిట్స్ సౌకర్యం కల్పించాలన్నారు. కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలన్నారు. ప్రభుత్వ శాఖలో ఉన్న ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. అర్హులైన వారందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఇల్లు స్థలం ఇచ్చి నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాబోయే కాలంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక ఉద్యోగ ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ పోరాటాలకు సిద్ధం కావాలని తెలిపారు. కార్యక్రమంలో ఆయా యూనియన్ నాయకులు సుబ్బారావు, జైలాన్, (మిగతా 6వ పేజీలో..)



ఆత్మకూరు : మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షుడు వి.యేసురత్నం

నకిలీ విత్తనాల నియంత్రణకు

దాడులు ముమ్మరం చేయండి : కలెక్టర్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ఖరీఫ్ సీజన్‌లో రైతులు నకిలీ విత్తనాలతో రైతులు మోసపోకుండా విత్తన విక్రయ దుకాణాలపై దాడులు ముమ్మరం చేయాలని జిల్లా కలెక్టర్ మనజిర్ జిలాని సమూన్ వ్యవసాయ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ ఛాంబర్‌లో జూమ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నకిలీ విత్తనాల కట్టడిపై జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ టి.నిశాంతిలతో కలిసి వ్యవసాయ అధికారులు, డిఎస్పీలు, తహశీల్దార్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మండల స్థాయిలో వ్యవసాయ అధికారి, పోలీసు, రెవెన్యూ అధికారులతో బృందాలు ఏర్పాటు చేసుకొని నకిలీ విత్తన విక్రయ కేంద్రాలపై ముమ్మరంగా దాడులు నిర్వహించి సీడ్ యాక్ట్ నిబంధనలను పటిష్టంగా అమలు చేయాలన్నారు. నకిలీ విత్తనాలపై ఫిర్యాదులు ఈ ఏడాది పునరావతం కాకుండా సంబంధిత మండల బృందాలు బాధ్యత తీసుకోవాలన్నారు. ఏ ఒక్క ఫిర్యాదు వచ్చినా సంబందిత అధికారులపై కఠిన చర్యలు తప్పవని ఆదేశించారు. ప్రధానంగా పత్తి, మిరప విత్తనాల్లో నకిలీ వస్తున్నాయని, సంబంధిత నకిలీ విత్తనాలు



విక్రయించినట్లు వెల్లడైతే ఎంతటి వారినైనా ఉపేక్షించకుండా చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ నకిలీ విత్తనాల విక్రయాన్ని అరికట్టేందుకు ఎస్ఒపి ప్రకారం పకడ్బందీగా అమలు పరచేందుకు చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను సూచించారు. జిల్లాలోని విత్తన విక్రయ కేంద్రాలు, ఎరువుల దుకాణాల జాబితాలను తమకు అందజేయాలని జిల్లా వ్యవసాయ అధికారికి సూచించారు. సమావేశంలో అన్ని మండలాల వ్యవసాయ శాఖ ఏడిలు, మండల వ్యవసాయ అధికారులు, డీఎస్పీలు, తహశీల్దారులు పాల్గొన్నారు.

నీడ లేదు.. నీళ్లు లేవు...

- ఎండలకు పని చేయలేకపోతున్నాం.. పనిముట్లు ఇవ్వడం లేదు..
- వ్యకాస నేతలతో ఉపాధి కూలీలు

ప్రజాశక్తి - నంద్యాల రూరల్

'ఎండలకు పని చేయాలంటే కష్టంగా ఉంటుంది. ఎండ వేడిమికి తట్టుకోలేకపోతున్నాం. ఉదయం 8 గంటలకే ఎండలు భగభగ మంటున్నాయి. కొద్ది సేపు విశ్రాంతి తీసుకుందామన్న నీడ ఉండడం లేదు. చెట్లు లేవు. ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లు కనీసం నీడ వసతి లేదు. తాగునీరు కూడా ఇంటి నుంచే తెచ్చుకుంటున్నాం. పనిముట్లు కూడా ఇవ్వడం లేదు. మేమే సొంతంగా ఇంటి వద్ద నుంచి పనిముట్లు తెచ్చుకుని పని చేస్తున్నాం. ఎండల నుంచి ఉపశమనం పొందేందుకు మజ్జిగ లాంటివి ఇస్తే బాగుంటుంది. పనుల వద్ద ఒక టెంటు వేస్తే నీడలో సేద తీరవచ్చు' అంటూ ఉపాధి కూలీలు ఎపి వ్యవసాయ కార్మిక సంఘం ప్రతినిధి బృందంతో తమ సమస్యలను విన్నవించారు. మంగళవారం నంద్యాల మండలం కానాల గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనుల తీరును, కూలీలను ఇబ్బందులను ఎపి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షులు టి.రమేష్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్‌ల ప్రతినిది బృందం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ చట్టానికి భారీగా నిధులు తగ్గించడం వల్ల కూలీలు పనిచేసే చోట కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయలేని దుస్థితి ఏర్పడిందన్నారు. ఉపాధి కూలీలు ఫోటో యాప్ ద్వారా చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కనీసం పనిచేసే చోట టెంటు సౌకర్యం, మంచినీళ్లు, మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మెడికల్ కిట్లు, ఇతర బీమా సౌకర్యం లేకపోవడం అన్యాయమన్నారు. ఈ సౌకర్యాలు లేకపోవడంతో పాటు తీవ్రమైన ఎండలు ఉండడంతో కూలీలు వడదెబ్బ తగిలి మరణిస్తున్నారని చెప్పారు. వారికి బీమా సౌకర్యం కూడా ఇవ్వడం లేదన్నారు.తక్షణమే అధికారులు ఈ సమస్యలను గుర్తించి పైఅధికారులు దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చేయాలని, లేనిపక్షంలో ఉపాధి కూలీలతో మరొకసారి పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు హుస్సేన్ వలి, యూసుఫ్, రమణమ్మ, హజరత్, కూలీలు పాల్గొన్నారు.



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న వ్యకాస జిల్లా అధ్యక్షులు టి.రమేష్ కుమార్



కేక్ కట్ చేస్తున్న నాయకులు

గంగుల కుటుంబంతోనే ఆళ్లగడ్డ అభివృద్ధి

- ఎంపిపి గజ్జల రాఘవేంద్ర రెడ్డి

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

ఆళ్లగడ్డ నియోజకవర్గ అభివృద్ధి గంగుల కుటుంబంలోనే సాధ్యమని, ఈ విషయంపై ఎక్కడైనా.. ఎప్పుడైనా చర్చకు సిద్ధమని ఎంపిపి గజ్జల రాఘవేంద్ర రెడ్డి అన్నారు. మంగళవారం ఆళ్లగడ్డలోని ఎమ్మెల్యే కార్యాలయంలో మీడియా సమావేశంలో బీజేపీ నాయకుడు భూమా కిషోర్ రెడ్డిని ఉద్దేశించి ఎంపిపి మాట్లాడారు. ఎమ్మెల్యే గంగుల నాని గురించి, గంగుల కుటుంబం హయాంలో ఆళ్లగడ్డలో జరిగిన అభివృద్ధిని విమర్శించే స్థాయి నీది కాదన్నారు. అసలు ఆళ్లగడ్డలో ఆసుపత్రిని, మంచి నీటి వసతినికల్పించిన ఘనత కేవలం గంగుల కుటుంబానికే దక్కుతుందన్నారు..

నాలుగు సంవత్సరాల పాలన సందర్భంగా కేక్ కట్ చేసిన వైసిపి శ్రేణులు : వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా వైసిపి నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ గొట్లూరు సుధాకర్ రెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ కూలూరు నరసింహారెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు బాలాబ్బి, గురుమూర్తి, చక్రపాణి, బద్రి సుధాకర్ రెడ్డి, కాంట్రాక్టర్ నజీర్, శివరామిరెడ్డి, విజయరెడ్డి, మునయ్య తదితరులు పాల్గొన్నారు.

తాపీ మేస్త్రీలకు బహుమతులు పంపిణీ

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ : పట్టణంలోని తాపీ మేస్త్రీలు, గుత్తేదారులకు మంగళవారం ప్రోత్సాహక బహుమతులను దాల్మియా సిమెంట్ డీలర్ శ్రీరాములు ఆధ్వర్యంలో పంపిణీ చేశారు.మంగళవారం జరిగిన సమావేశంలో పలువురు దాల్మియా సిమెంట్ గురించి ప్రశంసించారు. కాంట్రాక్టర్ నన్నేబై గారి జిలానీ మాట్లాడుతూ దాల్మియా సిమెంట్ ఎంతో నాణ్యమైనదని, దృఢమైనదన్నారు. అనంతరం డీలర్ శ్రీరాములు తాపీ మేస్త్రీల సమస్యలు తెలుసుకున్నారు.



బహుమతులు అందజేస్తున్న దృశ్యం

మొరాయిస్తున్న సర్వర్లు..

- రెండ్రోజులుగా నిలిచిన రిజిస్ట్రేషన్లు

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

రిజిస్ట్రేషన్ శాఖలో సర్వర్ డౌన్ కావడంతో వినియోగదారులు అవస్థలు పడుతున్నారు. ఆళ్లగడ్డ సబ్ రిజిస్టర్ కార్యాలయంలో రెండు రోజులుగా రిజిస్ట్రేషన్ల ప్రక్రియ పూర్తిగా నిలిచిపోయింది. దీంతో కొనుగోలుదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. జూన్ 1వ తేదీ నుండి భూములు, స్థలాల మార్కెట్ విలువల పెంపునకు ప్రభుత్వం రంగం సిద్ధం చేసిన నేపథ్యంలో రిజిస్ట్రేషన్లు చేసుకునేందుకు ప్రజలు కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. జూన్ 1 నుండి రిజిస్ట్రేషన్ చలానా మొత్తం ఇప్పటితో పోలిస్తే 70 నుండి 80 శాతం వరకూ పెరగనున్నట్లు తెలిసింది. ఉదాహరణకు ఈ రోజు రిజిస్టర్ చేసుకుంటే అయ్యే వ్యయం 10 వేల రూపాయలు ఉంటే అదే ధర జూన్ 1 తర్వాత 16 నుంచి 18 వేల రూపాయలు అవుతుందని అంచనా. దీంతో చాలామంది భూములు, స్థలాల కొనుగోలుదారులు గత రెండు రోజులుగా రిజిస్ట్రేషన్‌ల కోసం బారులు తీరారు. ఈ విషయమై ఆళ్లగడ్డ సబ్ రిజిస్టర్ అబ్దుల్ సత్తార్‌ను విలేకరులు ప్రశ్నించగా రెండు రోజుల నుంచి ఆన్లైన్ సేవలు రాష్ట్ర వ్యాప్తంగా కూడా పని చేయడం లేదన్నారు. తమ కార్యాలయంలో 100 డాక్యుమెంట్లు ప్రస్తుతం రిజిస్ట్రేషన్ కోసం పెండింగ్లో ఉన్నట్లు తెలిపారు. ఆన్లైన్ అందుబాటులోకి వచ్చిన వెంటనే రిజిస్ట్రేషన్లు పూర్తి చేస్తామని పేర్కొన్నారు. జూన్ 1 నుండి రిజిస్ట్రేషన్ విలువల పెరుగుదల ప్రకారం రిజిస్టర్లు ఉంటాయన్నారు. ఆళ్లగడ్డ టౌన్ మార్కెట్ విలువల ఆధారంగా రిజిస్ట్రేషన్ ఫీజు పెరుగుదల ఉంటుందని తెలిపారు. కాగా సిరివెళ్ల సబ్ రిజిస్టర్ కార్యాలయంలో 25 డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ కోసం పెండింగ్లో ఉన్నట్లు అధికారులు తెలిపారు.



నిలిచిన రిజిస్ట్రేషన్ సేవలు

ఉద్యోగుల సమస్యలు పట్టని ప్రభుత్వం

- ఎపి ప్రభుత్వ ఉద్యోగుల సంఘం

ప్రజాశక్తి - కోవెలకుంట్ల

ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడంలో అలసత్వం ప్రదర్శిస్తూ, ఏ సమస్యను కూడా పరిష్కారం దిశలో ఆలోచించడం లేదని ఎపి జిఇఒ జిల్లా అధ్యక్షులు ఎంసి నరసింహులు, ప్రధాన కార్యదర్శి నాగేంద్రప్పలు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట కోయిలకుంట్ల తాలూకా అధ్యక్షులు గురుమూర్తి అధ్యక్షతన రిలే దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్స్, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై సంఘం దశల వారీ పోరాటంలో భాగంగా ఈ దీక్షలు చేపట్టామన్నారు. ఉపాధ్యాయ సమస్యలపై ఎపిటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఖాజాహుస్సేన్ మాట్లాడారు. కార్య క్రమంలో గిరి, శంకరరెడ్డి, శ్రీనివాసులు, నరసింహులు, నాగేంద్రప్ప, ఎపిజిఇఎ జిల్లా కార్యవర్గ సభ్యులు ఆంజనేయులు, సంజీవ రాయుడు, ఉపాధ్యాయులు మద్దయ్య, సతీష్, ఇబ్రహీం, విజయభాస్కర్, వీఆర్వో సంఘం నాయకులు, పెన్షనర్ సంఘం సభ్యులు పాల్గొన్నారు.



రిలే దీక్షలో పాల్గొన్న ఉద్యోగ సంఘాల నాయకులు

రైతు సంఘాలను నిర్మించండి

- రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎ.రాజశేఖర్

ప్రజాశక్తి - ఆత్మకూర్

రాజకీయాలతో సంబంధం లేకుండా రైతులు తమ సమస్యల పరిష్కారం కోసం సంఘటితమై సంఘాన్ని ఏర్పాటు చేసుకొని, సభ్యులుగా చేరాలని ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ.రాజశేఖర్ కోరారు. మంగళవారం పట్టణంలోని డాక్టర్ ఏ.ధనుంజయ మీటింగ్ హాల్‌లో ఎపి రైతు సంఘం మండల కమిటీ సమావేశం మండల అధ్యక్షులు పి.మాభాష అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తీవ్రమైన సంక్షోభంలో ఉన్నారని తెలిపారు. పండిన పంటకు గిట్టుబాటు ధర లేక పెట్టుబడి ఖర్చులు పెరిగి రైతుల ఆత్మహత్యలు పెరుగుతున్నాయని చెప్పారు. ఎన్నికల సమయంలో ప్రభుత్వాలు ఇస్తున్న మాటలు నీటి మూటలుగా ఉన్నాయి తప్ప రైతులకు అనుకూలమైన విధానాలు లేవన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన బడ్జెట్లు రైతులకు వ్యతిరేకంగా ఉన్నాయి తప్ప పరిష్కరించే విధంగా లేవన్నారు. ఈ ప్రాంతంలో పండిన పంటలు ఉల్లి, టమోటా, పత్తి, వేరుశనగ, మిరప, మొక్కజొన్న, మినుముకు ధర లేక రైతులు మనోవేదనకు గురవుతున్నారని తెలిపారు. విత్తన కంపెనీలు నకిలీ విత్తనాలమ్మి రైతులను మోసం చేస్తున్నాయని అన్నారు. వీటిని అరికట్టేందుకు రైతులు సిద్ధపడాలని, అందుకోసం బలమైన సంఘ నిర్మాణం అవసరమన్నారు. ప్రతి గ్రామంలో రైతు సంఘాన్ని నిర్మించాలన్నారు. సిద్దాపురం చెరువు కింద పంట కాలువలు పూర్తి చేసి ఆయకట్టు భూములకు నీరు ఇవ్వాలన్నారు. ఆత్మకూరు పెద్దవాగు నుంచి వడ్లవాపురం చిన్నవాగుకు లిఫ్ట్ ద్వారా నీరు మళ్లించి సాగునీరు అందించాలన్నారు. రానున్న ఖరీఫ్ సీజన్లో రైతులకు అన్ని రకాల విత్తనాలు ఉచితంగా ఇవ్వాలని, విద్యుత్‌ను ఉచితంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి వీరన్న, నాయకులు అంబయ్య, శివుడు, క్రిష్ణ మోహన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఏ.రాజశేఖర్

సిద్దేశ్వరం వద్ద పటిష్ట భద్రత : ఎస్ఐ

ప్రజాశక్తి - కొత్తపల్లి

సిద్దేశ్వరం వద్ద జరగనున్న జల జాగరణ దీక్షకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట భద్రత తీసుకుంటామని ఎస్సై హుస్సేన్ బాష తెలిపారు. మంగళవారం కొత్తపల్లి మండలంలోని సంగమేశ్వరం సమీపంలోని సిద్దేశ్వరం జల జాగరణ దీక్ష చేపట్టే స్థలాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సిద్దేశ్వరం వద్ద జరగనున్న రాయలసీమ సాగునీటి సాధన సమితి ఆధ్వర్యంలో జరగనున్న దీక్షకు ప్రత్యేక భద్రత ఏర్పాటు చేస్తామన్నారు. దీక్షలో పాల్గొనేవారు ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించకుండా, శాంతియుతంగా చేసుకోవాలన్నారు. హెడ్ కానిస్టేబుల్ ఓబులేసు కానిస్టేబుల్ ప్రసాద్ నాయక్ సుదర్శన్ పాల్గొన్నారు.

పాము కాటుతో ఉపాధి కూలీకి తీవ్ర అస్వస్థత

ప్రజాశక్తి - రుద్రవరం

మండలంలోని పెద్ద కంబలూరు గ్రామంలో ఉపాధి కూలికి పాము కాటు వేయడంతో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. గ్రామస్తుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన సర్వేష్ మంగళవారం గ్రామ సమీపంలో ఉపాధి పనులు చేస్తుండగా పాము కాటు వేసింది. దీంతో వెంటనే అతన్ని చికిత్స నిమిత్తం రుద్రవరంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం అతన్ని నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

అభివృద్ధికి సహకరించాలి : చైర్మన్

ప్రజాశక్తి - ఆత్మకూరు

ఆత్మకూర్ మున్సిపాలిటీ అభివృద్ధి కోసం ప్రజాప్రతినిధులందరూ సహకరించాలని మునిసిపాలిటీ చైర్మన్ డాక్టర్ ఆసియా అన్నారు. మంగళవారం స్థానిక అన్న క్యాంటీన్‌లో మున్సిపాలిటీ సమావేశం నిర్వహించారు. మొత్తం 19 అజెండాల అంశాలపై సభ్యులు చర్చలో పాల్గొని ఏకగ్రీవంగా ఆమోదించారు. కౌన్సిలర్ సుల్తాన్ మాట్లాడుతూ తన వార్డు పరిధిలో సిసి రోడ్డు వేయాలని ఎనిమిది సంవత్సరాలుగా కౌన్సిల్ సమావేశంలో ప్రస్తావిస్తున్నప్పటికీ ఇంతవరకు వేయకపోవడం ఏమిటని అధికారులను నిలదీశారు. చెప్పిన పనులు చేయకపోతే ఇక సమావేశాలకు ఎందుకు రావాలని మనస్థాపం వ్యక్తం చేశారు. సమావేశంలో వైస్ చైర్మన్ రాజగోపాల్, కౌన్సిలర్ విజయ్ చౌదరి, రంగస్వామి, ప్రకాష్ రావు, పాణ్యం పార్వతి, కమిషనర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ డాక్టర్ ఆసియా





రిలయన్స్ ట్రెండ్స్ స్టోర్ షోరూమ్

బనగానపల్లెలో ట్రెండ్స్ స్టోర్ ప్రారంభం

ప్రజాశక్తి-బనగానపల్లె

పట్టణంలో రిలయన్స్ ట్రెండ్స్ స్టోర్‌ను మంగళవారం ప్రారంభించారు. 8200 చదరపు అడుగుల విస్తీర్ణం గల ఈ నూతన ట్రెండ్స్ స్టోర్ అత్యాధునిక రూపంతో మంచి నాణ్యత, ఆకర్షణీయమైన దుస్తుల శ్రేణితో ఈ స్టోర్ ప్రారంభించినట్లు ఆ సంస్థ ప్రతినిధి తెలిపారు. సంతృప్తికరమైన ధరలకు ఆధునిక ఉమెన్స్ వేర్, మెన్స్ వేర్, కిడ్స్ వేర్ మరియు ఫ్యాషన్ యాక్ససరీస్ కోసం విలక్షణమైన ప్రత్యేక మరియు గొప్ప షాపింగ్ అనుభవం కోసం ఎదురుచూడవచ్చని అన్నారు. ప్రత్యేకమైన ప్రారంభోత్సవ ఆఫర్ కింద రూ.3999 షాపింగ్ చేస్తే రూ.249కే మంచి బహుమతి పొందవచ్చని, దాంతో పాటు రూ.3999 కొనుగోలుపై వినియోగదారులు రూ. 2000 విలువ గల కూపన్లు పూర్తి ఉచితంగా పొందవచ్చని తెలిపారు. గొప్ప ఫ్యాషన్ షాపింగ్ అనుభవాన్ని ఆనందించడానికి ట్రెండ్స్ స్టోర్‌ను సందర్శించాలని కోరారు.

బిల్లులు అప్‌లోడ్ చేయండి : కలెక్టర్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్ : జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు పూర్తయిన వాటికి ఎక్స్పెండిచర్ బుక్ చేయాలని, ప్రతి రోజూ రూ. 2 కోట్లు బిల్లులను అప్లోడ్ చేయాలని హౌసింగ్ ఇంజనీర్లు, సచివాలయ సిబ్బందిని కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జగనన్న లేఔట్లలో గృహ నిర్మాణాల పురోగతిపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో హౌసింగ్ పిడి రామశేషు, ఈఈ మాధవరావు, అన్ని మండలాల తహసీల్దార్లు, ఎంపిడిఒలు, హౌసింగ్ ఇంజనీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సర్వీస్ రోడ్డుపై గుంతలు పూడ్చాలి : సిఐటియు

ప్రజాశక్తి - పాణ్యం : పాణ్యం నుండి నంద్యాలకు వెళ్లే కెఆర్ఆర్ స్కూల్ దగ్గర సర్వీస్ రోడ్డుపై పడ్డ గుంతలు పూడ్చాలని సిఐటియు ఆధ్వర్యంలో మంగళవారం రోడ్డుపై నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి కె భాస్కర్, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు బత్తిని ప్రతాప్, కెజె శ్రీనివాసరావులు మాట్లాడారు. హైవే అధికారులు, గ్రామ పంచాయతీల నిర్లక్ష్యం వలన సర్వీస్ రోడ్డుపై పైపులైన్ ఉండడం వలన గుంతలు పడి ప్రయాణికులకు, వాహనాలకు చాలా ఇబ్బందికరంగా ఉందన్నారు. వెంటనే గ్రామపంచాయతీ, హైవే అధికారులు గుంతలు పూడ్చాలని, లేనిపక్షంలో సిఐటియు ఆధ్వర్యంలో హైవేపై ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఆటో వర్కర్స్ గోవిందు, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న నాయకులు


చౌడేశ్వరి జ్యోతుల మహోత్సవం చేస్తున్న దృశ్యం

ముగిసిన జ్యోతి మహోత్సవాలు

- వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే

ప్రజాశక్తి - బండి ఆత్మకూరు

బండి ఆత్మకూరులో వెలసిన చౌడేశ్వరి దేవి జ్యోతి మహోత్సవ వేడుకలు మంగళవారం అంగరంగ వైభవంగా ముగిశాయి. తెల్లవారుజాము నుంచే తొగట వీరక్షత్రియులు తలపైన జ్యోతులను ఎత్తుకొని మేళ తాళాలు, మంగళ వాయిద్యాల మధ్య గ్రామ పురవీధుల గుండా ఆలయం వద్దకు చేరుకుని అమ్మ వారికి జ్యోతులు సమర్పించారు. ఈ వేడుకల్లో శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డిలు వేర్వేరుగా పాల్గొని అమ్మ వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆనంతరం వారు వారి వారి ముఖ్య నాయకుల ఇళ్లకు వెళ్లి విందులో పాల్గొన్నారు. ఈ వేడుకల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా సిఐ రవీంద్ర పర్యవేక్షణలోఎస్సై బాబు పటిష్ట పోలీసు భద్రత చర్యలు చేపట్టారు.

వాలంటీర్ల సేవలు అభినందనీయం : ఎంపిపి

ప్రజాశక్తి - బేతంచెర్ల : ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో వాలంటీర్లు చేస్తున్న సేవలు అభినందనీయమని ఎంపిపి బుగ్గన నాగభూషణం రెడ్డి, వైసీపీ సీనియర్ నాయకులు బాబుల్ రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని ఎంబాయి, పెండకల్లు గ్రామాలలో వాలంటీర్లకు సన్మాన కార్యక్రమం ఎంపీడీవో వెంగన్న ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అనంతరం కార్యక్రమంలో వాలంటీర్ల సేవరత్న అవార్డును చంద్ర నాయుడుకు అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచులు యుగంధర్ రెడ్డి, రామక్క, గోరుమానుకొండ సర్పంచి కోడే వెంకటేశ్వర్లు, గూని నాగరాజు, తిరుమలేశ్వర్ రెడ్డి, వాల్మీకి ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు మురళీకృష్ణ, ముస్లిం మైనార్టీ నాయకులు మూర్తి జావలి, చింతల నాగిరెడ్డి, ఎద్దులన్న తదితరులు పాల్గొన్నారు. **కొత్తపల్లి :** గ్రామాల్లో వాలంటీర్ల సేవలు మరువలేనివని సోముల సుధాకర్ రెడ్డి తెలిపారు. మండలంలోని గువ్వలకుంట్ల గ్రామంలో వాలంటీర్లకు సన్మాన కార్యక్రమం సర్పంచ్ మశమ్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం వాలంటీర్లను సన్మానించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి చాందిని, విఆర్వో కృష్ణారెడ్డి, ఎంపీటీసీ స్రవంతి, వైఎస్ఆర్సిపి నాయకులు రవీంద్రారెడ్డి పలువురు పాల్గొన్నారు.

సంబరాలు కాదు.. సమస్యలు పరిష్కరించండి : ఎఐటియుసి

ప్రజాశక్తి - నంద్యాల అర్బన్

వైసిపి ప్రభుత్వ పాలన నాలుగేళ్లు పూర్తి చేసుకుందని నేతలు సంబరాలు చేసుకోవడం కాదని, ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్, కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఎఐటియుసి పట్టణ ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్, కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని మంగళవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట చేపట్టిన నిరాహార దీక్షకు ఆయన మద్దతు తెలియజేసి మాట్లాడారు. నాలుగు సంవత్సరాల వైసిపి పాలనలో ప్రజలకు, ప్రభుత్వ, కాంట్రాక్ట్ కార్మికులకు ఏమి లబ్ధి చేకూర్చారో చెప్పాలన్నారు. సమస్యలను గాలికి వదిలేసి ఏదో సాధించారని సంబరాలు జరుపుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఇప్పటికైనా సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

ఐక్య పోరాటాలతోనే హక్కులు

(5వ పేజీ తరువాయి..) గోపాల్, సుబ్బరాయుడు ,రాజు, బలరాం, మాధవ, ఎల్లయ్య, ఆంజనేయులు, మధు, ఏసన్న, నరసింహా, కార్మికులు పాల్గొన్నారు. **ఆత్మకూరు :** పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదుట సిఐటియు జెండాను సిఐటియు జిల్లా అధ్యక్షులు ఏసురత్నం ఆవిష్కరించారు. సిఐటియు పట్టణ అధ్యక్ష కార్యదర్శులు రజాక్, రామ్ నాయక్, ఉపాధ్యక్షులు రణధీర్, మండల కార్యదర్శి భాస్కర్, నరసింహ నాయక్, నాయకులు, సురేంద్ర, సద్దాం, జేబివుల్లా, చాంద్ భాషా, రైట్ బాషా, రఫీ, శివకుమార్, నబిసా, గణపతి, రాము, రవి తదితరులు పాల్గొన్నారు. **శ్రీశైలం ప్రాజెక్టు :** సుండిపెంట కాలనీలో సిఐటియు ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా సంఘం కార్యాలయంలో జెండాను ఆవిష్కరించారు. మండల అధ్యక్షులు దర్శనం నాగరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా నాయకులు మునిపాటి చిన్న మారెన్న, సిపిఎం మండల నాయకులు జి.నాగసైదయ్య మాట్లాడారు. సిఐటియు మండల నాయకులు ఎం.మల్లికార్జున, అనుబంధ సంఘాల నాయకులు శివ, వినయ్, రవి, అశోక్, శ్రీకాంత్, జోసఫ్, ఉదరదాసు, అభిషేక్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. **పాణ్యం:** మండలంలోని తమ్మరాజు పల్లి గ్రామంలో హమాలీ యూనియన్ ఆధ్వర్యంలో ఎర్రజెండాను సిఐటియు మండల కార్యదర్శి భాస్కర్ ఎగురవేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు బత్తిని ప్రతాప్, కె.జె శ్రీనివాసరావు, హమాలీ యూనియన్ నాయకులు వెంకటేశ్వర్లు, మధు, సురేష్, విష్ణు, కేశయాలు, మద్దిలేటి, పరమేష్ పాల్గొన్నారు. **బేతంచెర్ల :** బేతంచర్ల పట్టణం, ఆర్ఎస్ రంగాపురం, బలపాలపల్లి గ్రామాలలో అన్ని యూనియన్ల కార్యాలయాల ముందు నాయకులు ఎర్రజెండా ఆవిష్కరణ చేశారు. సిఐటియు జిల్లా నాయకులు వైబి వెంకటేశ్వర్లు, వై.ఎల్లయ్య మాట్లాడారు. వ్యకాసం జిల్లా అధ్యక్షులు ఆర్ ఈశ్వరయ్య, సిఐటియు మండల కార్యదర్శి ఎస్.రహంతుల్లా, అనుంబంధ సంఘాల నాయకులు బి.రామాంజనేయులు, ఎస్కే భాష, రమణ, రాజబాబు, నాగరాజు, వెంకటేశ్వర్లు, రంగాపురం మల్లికార్జున, తిమ్మయ్య, రాముడు, బాలయ్య, రషీద్, దస్తగిరి, అహ్మద్, మదార్‌వలి, వెంకటేష్ కుమార్, రామచంద్రుడు, జై శ్రీనివాసులు, నారాయణ, భాష, కోవెలకుంట్ల భాష, మహేష్ రెడ్డి, మద్దిలేటి, రాజు, కార్మికులు పాల్గొన్నారు. **ప్యాపిలి :** మండలంలోని జలదుర్గం గ్రామంలోని బస్టాండ్ ప్రాంతంలో సిఐటియు జెండాను అధ్యక్షులు హుస్సేన్ అధ్యక్షతన నాయకులు జెవి. శ్రీనివాసులు ఆవిష్కరించారు. పద్మశాలి శ్రీనివాసులు, మాసూం, నారాయణస్వామి, రఫీ, సుధాకర్, జె.శ్రీని, వై.సురేష్, షేక్షావలి, బసవరాజు, కేశవులు పాల్గొన్నారు. **పాములపాడు :** పాములపాడులో సిఐటియు మండల కార్యదర్శి పరమేశ్ జెండాను ఆవిష్కరించారు. కౌలు రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సోమన్న, రైతు సంఘం కార్యదర్శి మండల వెంకటేశ్వరరావు మాట్లాడారు. సిఐటియు నాయకులు హనుమంతు, బ్రహ్మయ్య, వైఆర్‌డిఎస్ అధ్యక్షులు షర్ఫుద్దీన్ అలీ, రజక సంఘం అధ్యక్షులు రామకృష్ణ పాల్గొన్నారు.


ప్యాపిలిలో మాట్లాడుతున్న నాయకులు



శ్రీశైలం ప్రాజెక్టు : సుండిపెంట కాలనీలో కేక్ కట్ చేస్తున్న సిఐటియు నాయకులు


పాణ్యం : మాట్లాడుతున్న నాయకులు



బేతంచెర్లలో జెండావిష్కరణ చేస్తున్న నాయకులు


పాములపాడులో జెండావిష్కరణ చేస్తున్న నాయకులు

ఏమి సాధించారని సంబరాలు..? : బిసి

ప్రజాశక్తి - బనగానపల్లె

వైసిపి ప్రభుత్వం ఏమి సాధించారని సంబరాలు చేసుకుంటున్నారో అర్థం కావడం లేదని మాజీ ఎమ్మెల్యే బిసి జనార్దన్ రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని టిడిపి కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మేనిఫెస్టోలోని పథకాలకు నిబంధనల పేరుతో తూట్లు పొడిచినందుకు సంబరాలా..? పేదలకు ఇవ్వాల్సిన నివాసయోగ్యమైన స్థలాలను వైసిపి నాయకులు అమ్ముకొని దాదాపు కోటిన్నర అర్జించినందుకా అని విమర్శించారు. పట్టణ ప్రజల కోసం అవసరమైతే తన ఆస్తులు అమ్మి అయినా 2 సెంట్లు ఇంటి స్థలం ఇస్తామని తెలిపారు. రూ.30 లక్షలు షాదీఖానా విధులు తాను తీసుకున్నట్లు నిరూపించాలని కాటసాని రామిరెడ్డికి సవాల్ విసిరారు. వైసిపి ప్రభుత్వం షాదిఖాన నిర్మించకపోతే తానే సొంత నిధులతో నిర్మిస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ అంబాల రామకృష్ణారెడ్డి, టిడిపి మండల అధ్యక్షుడు పివి కుమార్ రెడ్డి, తెలుగు యువత నంద్యాల పార్లమెంటు అధ్యక్షుడు బొబ్బల గోపాల్ రెడ్డి, ఉప సర్పంచ్ బురానుద్దిన్, మిట్టపల్లె, పాతపాడు సర్పంచులు తులసి రెడ్డి, బెడదల మహేష్ రెడ్డి, నాయకులు ఎర్రగుడి భాస్కర్ రెడ్డి, హుస్సేనాపురం జాంగిర్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి

పచ్చని చెట్లకు నిప్పు

ప్రజాశక్తి - రుద్రవరం

మానవుని మనుగడ, వాతావరణ సమతుల్యాన్ని కాపాడుతున్న పచ్చని చెట్లను కొందరు స్వార్థపరులు కాల్చి వేస్తున్నారు. రుద్రవరం మండలంలోని నరసాపురం, అహోబిలం, ఆళ్లగడ్డ, చాగలమర్రి, ప్రధాన రహదారుల వెంట గత 40 సంవత్సరాల క్రితం ఫారెస్ట్ అధికారులు రోడ్డు ఇరువైపులా సోషల్ ఫారెస్ట్ ఆధ్వర్యంలో మొక్కలు నాటించారు. నేటికీ ఆ మొక్కలు పెరిగి భారీ వృక్షాలుగా పెరిగాయి. ఈ వృక్షాలను రోడ్డు వెడల్పు పేరుతో కొన్ని, విద్యుత్ స్తంభాలు ఏర్పాటుతో మరికొన్ని చెట్లను నరికి పచ్చదనం లేకుండా చేస్తున్నారు. కొందరు తమ పొలాల దగ్గర పంటలు సక్రమంగా రాలేదని నిప్పు పెట్టి చెట్లను కూల్చి వేస్తున్నారు. దీంతో ఎన్నో సంవత్సరాల నుంచి పెరిగిన భారీ వృక్షాలు అగ్నికి ఆహుతి అవుతున్నాయి. లక్షలాది రూపాయలు ఖర్చు చేసి సోషల్ ఫారెస్ట్, ఉపాధి హామీ పథకం కింద అధికారులు రోడ్డుకు ఇరువైపులా మొక్కలను నాటిస్తున్నారు. అయితే అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఎవరు పడితే వారు చెట్లను నరకడం, కాల్చివేయడం లాంటివి చేస్తున్నారు. మానవాళికి ప్రాణవాయువు ఇస్తున్న చెట్లను కూల్చివేస్తున్నా అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తుండడంతో పలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి చెట్లను నరికే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.


నరసాపురం సమీపంలో చెట్లకు నిప్పు పెట్టిన దృశ్యం

ఆర్‌బికెల ద్వారా విత్తనాలు ఇవ్వాలి

- రైతు సంఘం డిమాండ్

ప్రజాశక్తి - బనగానపల్లె

ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతున్నందు వల్ల రైతాంగానికి అవసరమైన అన్ని రకాల విత్తనాలు రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల ద్వారా ఇవ్వాలని, నకిలీ విత్తనాల బారిన పడకుండా కాపాడాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి టి. రామచంద్రుడు డిమాండ్ చేశారు మంగళవారం బనగానపల్లె పట్టణంలో మండల కార్యదర్శి సుబ్బయ్య అధ్యక్షతన జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతున్నందున ఇప్పటికే నంద్యాల జిల్లాలోని రైతాంగం పత్తి, మొక్కజొన్న, వరి విత్తనాల కోసం వివిధ రకాల కంపెనీల ప్రతినిధుల చుట్టూ, షాపుల చుట్టూ తిరగడం ప్రారంభమైదని తెలిపారు. వివిధ రకాల కంపెనీలు గ్రామాల్లోని కొంతమంది పెద్దల ఇళ్లకు విత్తనాల ప్యాకెట్లు చేరుస్తున్నారని, ఏ విత్తనాలు నాణ్యమైనవో, నకిలీవో అర్థం కాని పరిస్థితుల్లో రైతాంగం ఉన్నారని చెప్పారు. గత రెండు మూడు సంవత్సరాలుగా పరిశీలిస్తే వివిధ రకాల కంపెనీలు అక్రమంగా విక్రయించిన నకిలీ విత్తనాల వల్ల జిల్లాలోని పత్తి, మొక్కజొన్న రైతాంగం తీవ్రంగా నష్టపోయిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే జోక్యం చేసుకొని ముందస్తు చర్యగా ఆర్‌బికెల ద్వారా నాణ్యమైన విత్తనాలను ఇవ్వాలన్నారు.


మాట్లాడుతున్నజిల్లా సహాయ కార్యదర్శి టి.రామచంద్రుడు

విజయపథంలో రాష్ట్రం : ఎంపీ, ఎమ్మెల్సీ

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

చరిత్ర ఎరగని సంక్షేమ పాలనకు నాలుగేళ్లు పూర్తయ్యాయని, ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్మోహన్ రెడ్డి రాష్ట్రాన్ని విజయ పథంలో నడిపించారని నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్ బాషా పేర్కొన్నారు. వైసిపి ప్రభుత్వం నాలుగేళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా మంగళవారం నంద్యాలలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఎంపీ, ఎమ్మెల్సీల ఆధ్వర్యంలో ఘనంగా సంబరాలు నిర్వహించారు. దివంగత సిఎం వైఎస్ఆర్ చిత్రపటానికి ఎంపీ, ఎమ్మెల్సీ, మార్క్ఫెడ్ చైర్మన్ పిపి నాగిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ మాబున్నీసాలు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగనన్న ప్రజా సంక్షేమ పాలన, సుపరిపాలనలో రాష్ట్రం అనేక విధాలుగా అభివృద్ధి సాధించిందని తెలిపారు. రానున్న కాలంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు రెట్టింపు ఉత్సాహంతో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ పిపి నాగిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ మాబున్నిసా, వైస్ చైర్మన్లు గంగిశెట్టి శ్రీధర్, పామ్‌షావలి, ఎంపిపి శెట్టి ప్రభాకర్, వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ మహేశ్వర్ రెడ్డి, డా. కల్లూరి రామలింగారెడ్డి, బెస్త సంఘం డైరెక్టర్ చంద్రశేఖర్, ఏపీఎస్పీడీసీఎల్ డైరెక్టర్ డాక్టర్ శశికళ రెడ్డి, దృశ్య కళల డైరెక్టర్ సునీత అమృతరాజ్, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ సిద్ధం శివరాం, మున్సిపల్ మాజీ చైర్మన్ డా. కైపా రాముడు, వైసిపి కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు. **ఆత్మకూర్ :** స్థానిక వైసిపి కార్యాలయం ఆవరణంలో శ్రీశైల నియోజవర్గ సమన్వయకర్త శిల్పా భువనేశ్వర్ రెడ్డి, జడ్పిటిసి శంకర్ రెడ్డి, ఎంపిపి నల్ల కాల్వ తిరుపాలమ్మ, పట్టణ అధ్యక్షుడు సయ్యద్ మీర్ తదితరులు కేకు కట్ చేశారు. కౌన్సిలర్ విజయ్ చౌదరి. సుల్తాన్, రంగస్వామి, ప్రకాష్. పాణ్యం పార్వతి, మండల అధ్యక్షుడు రాజమోహన్ రెడ్డి, ఎంపిటిసిలు, సర్పంచులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **నందికొట్కూరు :** పట్టణంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే తోగూరు ఆర్థర్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు.కార్యక్రమంలో గంగిరెడ్డి రమాదేవి, కౌన్సిలర్ జాకీర్ హుస్సేన్, మున్సిపల్ వైస్ చైర్మన్ రబ్బాని, డాక్టర్ వనజ, నాయకులు జాను, తమ్మడపల్లి విక్టర్, శంకరయ్య, ఇనైతుల్లా తదితరులు పాల్గొన్నారు.


నంద్యాల : కేక్ కట్ చేస్తున్న ఎంపీ, ఎమ్మెల్సీ తదితరులు



ఆత్మకూరులో..


నందికొట్కూరు : కేక్ కట్ తినిపిస్తున్న ఎమ్మెల్యే

శ్రీశైలంలో తెలంగాణ మంత్రులు

ప్రజాశక్తి - శ్రీశైలం

శ్రీశైల క్షేత్రంలోని భ్రమరాంబ మల్లికార్జున స్వామి అమ్మవార్లను మంగళవారం తెలంగాణ ఆర్థిక శాఖ మంత్రి హరీష్ రావు, వ్యవసాయ శాఖ మంత్రి ఎస్.నిరంజన్ రెడ్డి తదితరులు దర్శించుకున్నారు. స్వామి అమ్మవారి దర్శనార్థం ఆలయం వద్దకు చేరుకున్న మంత్రులకు ఆలయ అధికారులు అర్చకులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. అనంతరం వారు స్వామి అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం అమ్మవారి ఆలయంలోని ఆశీర్వచన మండపంలో మంత్రులకు ఆలయ అర్చకులు, వేదపండితులు ఆశీర్వచనం చేసి తీర్థ ప్రసాదాలను అందజేశారు. అనంతరం శ్రీశైలంలో నూతనంగా నిర్మించిన మల్లికార్జున నిత్య అన్నదాన సత్రం ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్నారు.

అక్రమ అడ్మిషన్లను అరికట్టాలి : పిడిఎస్‌యు

ప్రజాశక్తి - డోన్

ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో ముందస్తు అక్రమ అడ్మిషన్లను అరికట్టాలని పిడిఎస్‌యు డోన్ డివిజన్ ప్రధానకార్యదర్శి కె.పవన్ డిమాండ్ చేశారు. మంగళవారం డోన్‌లోని పిడిఎస్‌యు మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఉన్న ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు ప్రభుత్వ విధానాలకు విరుద్ధంగా ముందస్తు అక్రమ అడ్మిషన్స్‌లు చేస్తున్నాయని విమర్శించారు. యాజమాన్యాలు టార్గెట్‌లు పెట్టి టీచర్లపై ఒత్తిడి చేస్తున్నారని తెలిపారు. ఈ విషయంపై విద్యాశాఖాధికారులు వెంటనే స్పందించాలన్నారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ధర్నాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయుకులు రాఘవేంద్ర, అమృతరాజ్, వేణు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డివిజన్ ప్రధాన కార్యదర్శి కె.పవన్

టిడిపి మేనిఫెస్టోపై మహిళల హర్షం

ప్రజాశక్తి- చాగలమర్రి

మహానాడులో టిడిపి జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు ప్రకటించిన మేనిఫెస్టోపై మంగళవారం పట్టణంలోని కుమ్మరి వీధిలో మహిళలు చంద్రబాబు ఫ్లెక్సీకి పాలాభిషేకం చేశారు. టిడిపి రాష్ట్ర మైనారిటీ సెల్ ఉపాధ్యక్షుడు ముల్లా అన్వర్‌బాష, టిడిపి మహిళా నాయకురాలు షేక్ మహబూబ్‌బీ ఆధ్వర్యంలో మహిళలు బారీ సంఖ్యలో తరలి వచ్చి హర్షం వ్యక్తం చేస్తూ క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కొలిమి మాబుషరీఫ్, ఆలంశ గారి మౌలాలి, దాదాబీడి బాష, గఫార్, హుసేన్‌పీరా, అజీం, నాగూర్, చాంద్‌బాష, రఫీ, మదార్ వలి, మగ్బూల్, రజియా, నసిమున్, అయేషా, మాబుచాన్, రాజ్యలక్ష్మి, నాగలక్ష్మి, తులసమ్మ, సుజాత తదితరులు పాల్గొన్నారు.

టిడిపి వస్తేనే బిసిలకు న్యాయం : రాష్ట్రంలో తెలుగు దేశం పార్టీ అధికారంలోకి వస్తేనే బీసీలకు సరైన న్యాయం జరుగుతుందని టిడిపి నంద్యాల పార్లమెంట్ బీసీ సెల్ స్పోక్ పర్సన్ సల్లానాగరాజు తెలిపారు. చాగలమర్రి పట్టణంలోని బీసీ సంఘం కార్యాలయంలో చంద్రబాబు నాయుడు చిత్రపటానికి. టిడిపి నాయకులు పాలాభిషేకం చేశారు. సంఘం అధ్యక్షులు లక్ష్మీనారాయణగౌడ్, నాయకులు దూదేకుల మహబూబ్బాషా, మహీంద్రాచారి, కృష్ణయాదవ్, ప్రసాదు, సుబ్బరాయుడు, నాగరాజు, లాల్ బాషా పాల్గొన్నారు. **నందికొట్కూరు :** నందికొట్కూరు పట్టణంలో బీసీ సెల్ అధ్యక్షులు పాణ్యం వేణు గోపాల్, మహిళల ఆధ్వర్యంలో చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ముఖ్యఅతిథిగా నియోజకవర్గం అధికార ప్రతినిధి డాక్టర్ కాకరవాడ చిన్న వెంకటస్వామి పాల్గొని మాట్లాడారు. ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి బుల్లెద్దుల రాజన్న, మహిళలు పాల్గొన్నారు. **పాణ్యం :** రాష్ట్ర అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమవుతుందని టిడిపి లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి లాయర్ బాబు అన్నారు. టిడిపి ప్రకటించిన మేనిఫెస్టో పట్ల మహిళలు, నిరుద్యోగులు, రైతులు ఉత్సాహంతో సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో టిడిపి అధికారంలోకి రావడం ఖాయమన్నారు. వైసిపి నాలుగేండ్ల పాలనలో ప్రజలు అష్టకష్టాలు పడ్డారని, నవరత్నాల పేరుతో నయవంచనకు గురిచేశారని అన్నారు.

విజ్ఞానాన్ని పెంచుకోవాలి

ప్రజాశక్తి - పగిడ్యాల : ప్రతి ఒక్కరూ గ్రంథాలయాలకు వచ్చి విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని గ్రంథాలయ అధికారి కె.మద్దమ్మ తెలిపారు. గ్రంథాలయ వేసవి విజ్ఞాన శిబిరాన్ని మంగళవారం పగిడ్యాల గ్రంధాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. పుస్తకాలు వార్తాపత్రికలు చదవడం వల్ల విజ్ఞానం పెంపొందు తుందన్నారు. అనంతరం విద్యార్థులచే బామ్మ చెప్పిన బంగారు నీతి కథ, పులి బంగారు కడియం నీతి కథలు చదివించారు. వివిధ రకాల ఆటలు పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ హైస్కూల్, ఆదర్శ పాఠశాల విద్యార్థులు విద్యార్థులు పాల్గొన్నారు.

వివక్షపై విచారణ జరపాలి

ప్రజాశక్తి - పాణ్యం : మండలంలోని నెరవాడ గ్రామంలో ఉపాధి పనుల్లో దళితుల పట్ల జరుగుతున్న వివక్షపై విచారణ జరపాలని మాలమహానాడు అధ్యక్షుడు దేవదత్తు డిమాండ్ చేశారు. మంగళవారం ప్రజాసంఘాల నాయకులు విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ అగ్రవర్ణాల వారికి అనుకూలమైన చోట పనులు, దళితులకు నిత్యం పురుగు, పుట్రా సంచరించే చోట పనులు చేపించడం వివక్షకు నిదర్శనమన్నారు.

కాలువ పనులను అడ్డుకున్న రైతులు

- హద్దులు ఏర్పాటు చేసి పనులు ప్రారంభిస్తామన్న అధికారులు

ప్రజాశక్తి - చాగలమర్రి : మండలంలోని చింతలచెరువు గ్రామం గుండా సాగుతున్న లోతుకుంట వాగు పనులను రైతులు అడ్డుకున్నారు. అధికారులు చేపట్టనున్న వంక పనులకు ఒక వైపు రహదారి వెడల్పు చేయాలంటూ కొందరు రైతులు, వాగు నిర్మాణంలో భాగంగా తమ పొలాలు పోయాయంటూ మరి కొందరు రైతులు వాదించారు. దీంతో మంగళవారం మండల సర్వేయర్ కేశవ రెడ్డి, తెలుగుగంగ ఏఈ సలీం, హెడ్ కానిస్టేబుళ్ళు గిరిబాబు, ఆనంద్‌లు సంఘటనా స్థలానికి చేరుకొని రైతులతో చర్చించారు. రైతులకు ఎవరికి అన్యాయం జరగకుండా కొలతలు వేసి, హద్దులను ఏర్పాటు చేసి పనులను చేపడుతామని హామీ ఇచ్చారు. అనంతరం అధికారులు వాగుకు ఇరువైపులా కొలతలు వేసి, హద్దులను ఏర్పాటు చేశారు. రహదారి వెడల్పుకు కూడా అధికారులు అంగీకరించడంతో రైతులు శాంతించారు.

టిబి రహిత సమాజం నిర్మిద్దాం

ప్రజాశక్తి - పాములపాడు : టిబి రహిత సమాజాన్ని నిర్మిద్దామని సర్పంచి అక్తరున్నిసా కోరారు. పాములపాడు మండలం మద్దూరు గ్రామం సచివాలయలో వాలంటీర్, సచివాలయ సిబ్బందికి 'టిబి ముక్త్ గ్రామ పంచాయత్' పై టిబి యూనిట్ ఆత్మకూరు వారు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టిబి యూనిట్ సూపర్వైజర్ చెరుకు రవికుమార్ మాట్లాడుతూ టిబి రహిత సమాజం కోసం ప్రజలందరూ అవగాహన కలిగి ఉండాలని, అపోహలు తొలగించుకోవాలని సూచించారు. జిల్లా, రాష్ట్ర స్థాయి బృందం ప్రమాణాలు పాటించి సర్వే నిర్వహించిన గ్రామాలను పర్యవేక్షించి ఎంపికైన గ్రామ పంచాయతీకి మొదటసారి కాంస్య గాంధీ ప్రతిమను, వరుసగా రెండోసారి ఎంపికయితే వెండి గాంధీ ప్రతిమను, మూడవ సారి బంగారు గాంధీ ప్రతిమను ఇచ్చి సత్కరిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి యశోద, సిహెచ్ఓ రేణుక దేవి, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలి

ప్రజాశక్తి - శ్రీశైలం ప్రాజెక్టు : పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించాలని ఫారెస్ట్ రేంజ్ అధికారి నర్సింహులు తెలిపారు. శ్రీశైల మండలంలో గత 20 రోజులుగా పర్యావరణంపై అవగాహన కల్పిస్తున్న కార్యక్రమంలో భాగంగా మంగళవారం స్థానిక సుండిపెంటలో సిఐటియు కార్యాలయ ప్రాంగణం, పరిసర ప్రాంతాలలో ప్రజలకు అవగాహనను కల్పించారు. ఈ సందర్భంగా ఆయన పర్యావరణహిత జీవన శైలిపై క్షుణంగా వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిఐటియు మండల అధ్యక్షులు దర్శనం నాగరాజు, ఎం.చిన్న మారెన్న, సిపిఎం నాయకులు నాగ సైదయ్య, మల్లికార్జునలు హాజరయ్యారు. కార్యక్రమంలో బీట్ అధికారి రవీంద్రనాథ్ ఠాగూర్, ఎస్.భీం నాయక్, ప్రొటెక్షన్ వాచర్లు, సిబ్బంది, నాగ వెంకటేష్, జి.మల్లికార్జున, నారాయణస్వామి, హనుమంతు రెడ్డి, మురళి తదితరులు పాల్గొన్నారు. **ఆళ్లగడ్డ :** ప్రతి ఒక్కరు ఆరోగ్యకరమైన జీవన శైలిని అలవర్చుకోవాలని నూతల సెక్షన్ ఫారెస్ట్ సిబ్బంది అన్నారు.. పర్యావరణ కోసం జీవనశైలి కార్యక్రమంలో భాగంగా మండలంలోని జి.జంబులదిన్నె గ్రామంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.

సిద్దేశ్వర అలుగు కోసం గళమెత్తాలి

ప్రజాశక్తి - నంద్యాల : సిద్దేశ్వరం అలుగు కోసం రాజకీయ పార్టీలు గళమెత్తాలని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షులు బొజ్జా దశరథరామిరెడ్డి కోరారు. మంగళవారం నంద్యాలలోని రాయలసీమ సాగునీటి సాధన సమితి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయనమ మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో పాలకులు అన్ని ప్రాంతాలను సమంగా అభివృద్ధి చేయాలని, కానీ దురదృష్టవశాత్తు ఆంధ్రప్రదేశ్‌లో దశాబ్దాలుగా ఇక్కడి పాలకులు, ప్రతిపక్ష పార్టీలు రాయలసీమ పట్ల వివక్షతను చూపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సాగునీటి హక్కుల కోసం ఈ నెల 31 సాయంత్రం 6 గంటల నుండి మరుసటి రోజు జూన్ 1వ తేది ఉదయం 10 గంటల వరకు సిద్దేశ్వర జలజాగరణ దీక్షను నిర్వహిస్తున్నామని, విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సమితి కార్యదర్శి మహేశ్వర రెడ్డి, కోశాధికారి వెంకటేశ్వర నాయుడు, ప్రజా సంబంధాల కార్యదర్శి నిట్టూరు సుదాకర్ రావు, కార్యవర్గ సభ్యులు కొమ్మా శ్రీహరి, భాస్కర్ రెడ్డి, పట్నం రాముడు, ఏర్వ రామి రెడ్డి పాల్గొన్నారు.